

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం

# వ్యవసాయం

మార్చి, 2021

సంపుటి - 7 | సంచిక-03 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



సమృద్ధి కృషి శిక్షా సమాన్ అవార్డును మహేంద్రా & మహేంద్రా సంస్థ ప్రతినిధి డా॥ కె. వంశీకృష్ణా రెడ్డి నుంచి అందుకుంటున్న ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు



నేరుగా వరి విత్తే పద్ధతిలో ఆచరణ గురించి ప్రాణాధార ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశమైన డా॥ వి. ప్రవీణ్ రావు మరియు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు



బోధన, అభ్యాసం మరియు పరిశోధనల కోసం సమాచార నిర్వహణ నైపుణ్యాలపై మాసీవ్ ఆన్‌లైన్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డా॥ వి. ప్రవీణ్ రావు



6వ జాతీయ యూత్ కన్వెన్షన్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపకులపతి



బయోడైవర్సిటీ పార్కులో పక్షుల ప్రదర్శనా బోర్డులను ప్రారంభిస్తున్న డా॥ వి. ప్రవీణ్ రావు



గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన సందర్భంగా బయో డైవర్సిటీ పార్కులో మొక్కను నాటి నీరుపోస్తున్న డా॥ వి. ప్రవీణ్ రావు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

మార్చి, 2021 శ్రీ శార్వరి నామ సం॥
మాఘ బహుళ విదియ సోమవారం
నుండి ఫాల్గుణ బహుళ తదియ
బుధవారం వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ జి. శ్రీనివాస్

ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (అగ్రానమి)

డా॥ యస్. రామగోపాల వర్మ

ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

పర్యవేక్షణ

డా॥ కాలిశెట్టి వాణిశ్రీ

శాస్త్రవేత్త



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.

డి. డి. అయితే

Principal Agricultural Information Officer, AI&CC and PJTSAU Press

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :

ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం. 040-24015380
e-mail : pjtsau.paio@gmail.com
paio.pjtsau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......... 5
2. ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.......... 6
3. వాతావరణం - పంటల పరిస్థితి - విశ్లేషణ.......... 12
4. సాంకేతిక వ్యాసాలు
   - యాసంగి వరిలో చిరుపొట్ట దశలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు.......... 13
   - మొక్కజొన్న పంటకోతలో పాటించవలసిన మెళకువలు. 14
   - వేసవి పెసర మరియు మినుములో సస్యరక్షణ...... 16
   - అపరాల పంటల కోత మరియు నిల్వలో తీసుకోవల్సిన ముందు జాగ్రత్తలు.......... 20
   - వేరుశనగ పంట కోతలో మెళకువలు.......... 22
   - మెట్ట వ్యవసాయంలో సవాళ్ళు మరియు వేసవి లోతుదుక్కుల ప్రాధాన్యత.......... 24
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్.......... 25
   - 2021-22 జాతీయ వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగ ప్రాముఖ్యత.......... 26
   - సేంద్రీయ ఎరువుగా చెఱకు చెత్త .......... 28
   - వ్యవసాయ పదవినోదం.......... 29
   - భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం మరియు మట్టి నమూనా సేకరణ పద్ధతులు.......... 30
   - వివిధ పంటల్లో నీటి యాజమాన్యం.......... 31
   - భారతదేశంలో నిషేధానికి గురైన, నమోదుకు నిరాకరించబడిన మరియు వాడకానికి పరిమితం చేయబడిన సస్యరక్షణ మందుల సమాచారం మరియు అవగాహన.......... 33
   - మిరపలో కోత మరియు కోతానంతరం చేపట్టవలసిన జాగ్రత్తలు.......... 35
   - మార్చి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.......... 36
   - వేసవిలో ఆకుకూరల సాగు - లాభాలు బాగు.......... 38
   - మామిడిలో సస్యరక్షణ.......... 40
   - క్యాబేజి జాతి కూరగాయల్లో సమగ్ర సస్యరక్షణ...... 42
   - అవిసె గింజలు - ఆరోగ్య ప్రయోజనాలు.......... 44
5. టి.వి. చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.......... 46
6. రైతన్నకో ప్రశ్న.......... 47
7. విశ్వవిద్యాలయ వార్తలు.......... 48
8. రైతు విజయగాథ
   - క్యారెట్ రైతు విజయగాథ .......... 49

# మార్చి మాసం క్యాలెండర్ - 2021

## శ్రీ శార్వరి నామ సం॥ మాఘ బహుళ విదియ సోమవారం నుండి ఫాల్గుణ బహుళ తదియ బుధవారం వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ. 3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ, 12,00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ. 1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ. 10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ. 9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | 1 మాఘ బ. విదియ ఉ. 11-12, ఉత్తర ఉ. 10-11, సా.వ. 6-07 ల 7-38 | 2 తదియ ఉ. 9-11, హస్త ఉ. 8-52, సా.వ. 4-22 ల 5-52 | 3 చవితి ఉ. 6-59, పంచమి తె. 4-36, చిత్త ఉ. 7-23, స్వాతి తె. 4-44, ప.వ. 12-24 ల 1-50 | 4 షష్ఠి రా. 2-13, విశాఖ తె. 4-03, ఉ.వ. 10-18 ల 11-50 | 5 సప్తమి రా. 11-52, అనూరాధ రా. 2-26, ఉ.వ. 7-46 ల 9-15 | 6 అష్టమి రా. 9-39, జ్యేష్ఠ రా. 12-57, ఉ.వ. 7-40 ల 9-10 |
| 7 నవమి రా. 7-37, మూల రా. 11-39, ఉ.వ. 8-31 ల 10-01, రా.వ. 10-08 ల 11-39 | 8 దశమి సా. 5-50, పూర్వాషాఢ రా. 10-39, ఉ.వ. 8-51 ల 10-23, తె.వ. 6-26 ల | 9 ఏకాదశి సా. 4-23, ఉత్తరాషాఢ రా. 9-59, ఉ.శే.వ. 7-59 వ, రా.వ. 1-56 ల 3-31 | 10 ద్వాదశి ప. 3-21, శ్రవణం రా. 9-44, రా.వ. 1-46 ల 3-23 | 11 త్రయోదశి ప. 2-47, ధనిష్ఠ రా. 9-56, తె.వ. 5-20 ల | 12 చతుర్దశి ప. 2-43, శతభిషం రా. 10-38, ఉ.శే.వ. 6-59 వ, తె.వ. 5-20 ల | 13 అమావాస్య ప. 3-08, పూర్వాభాద్ర రా. 11-49, ఉ.శే.వ. 7-01 |
| 14 ఫాల్గుణ శు. పాడ్యమి సా. 4-06, ఉత్తరాభాద్ర రా. 1-20, ఉ.వ. 10-00 ల 11-42 | 15 విదియ సా. 5-30, రేవతి తె. 3-34, ప.వ. 2-26 ల 4-11 | 16 తదియ రా. 7-15, అశ్విని తె. 5-56, రా.వ. 1-32 ల 3-17 | 17 చవితి రా. 9-16, భరణి పూర్తి, సా.వ. 4-33 ల 6-19 | 18 పంచమి రా. 11-22, భరణి ఉ. 8-30, రా.వ. 9-48 ల 11-35 | 19 షష్ఠి రా. 1-22, కృత్తిక ఉ. 11-06, తె.వ. 4-44 ల | 20 సప్తమి తె.3-09, రోహిణి ప. 1-33, ఉ.శే.వ. 6-30 వ, రా.వ. 7-39 ల 9-23 |
| 21 అష్టమి తె. 4-33, మృగశిర ప. 3-41, రా.వ. 12-41 ల 2-24 | 22 నవమి తె. 5-30, ఆర్ద్ర సా. 5-25, తె.వ. 6-03 ల | 23 దశమి తె. 5-57, పునర్వసు సా. 6-41, ఉ.శే.వ. 7-44 వ తె.వ. 2-57 ల 4-36 | 24 ఏకాదశి తె. 5-53, పుష్యమి రా. 7-28, వర్జ్యము లేదు | 25 ద్వాదశి తె. 5-18, ఆశ్రేష రా. 7-45, ఉ.వ. 8-24 ల 10-01 | 26 త్రయోదశి తె. 4-16, మఘ రా. 7-35, ఉ.వ. 7-39 ల 9-19, తె.వ. 3-23 ల 4-56 | 27 చతుర్దశి రా. 2-50, పుబ్బ సా. 6-59, రా.వ. 1-54 ల 3-26 |
| 28 పూర్ణిమ రా. 1-04, ఉత్తర సా. 6-02, రా.వ. 2-03 ల 3-35 | 29 ఫాల్గుణ బ.పాడ్యమి రా. 11-02, హస్త సా. 4-58, రా.వ. 12-25 ల 1-54 | 30 విదియ రా. 8-48, చిత్ర ప. 3-20, రా.వ. 8-33 ల 10-03 | 31 తదియ సా. 6-24, స్వాతి ప. 1-44, సా.వ. 6-55 ల 8-23 | | | |

11 మహాశివరాత్రి    29 హోలి    12 షాబ్-ఇ-మిరాజ్    29 షాబ్-ఇ-బరత్

**పూర్వాభాద్ర కార్తె (4.03.21 నుండి 16.03.21)**

| | | |
|---|---|---|
| వరి | : | ఆలస్యంగా నాటితే రెండవ దఫా ఎరువులు వేయుట, సస్యరక్షణ |
| గోధుమ | : | కోతలు |
| జొన్న | : | వేసవి పంటకు సస్యరక్షణ |
| రాగి | : | రబీ రాగి కోతలు |
| సజ్జ | : | సస్యరక్షణ |
| వేరుశనగ | : | ఎరువులు - సస్యరక్షణ |
| చెఱకు | : | జనవరిలో నాటిన పైరుకు ఎరువులు వేయుట, సస్యరక్షణ |
| పప్పుదినుసులు | : | మాగాణిలో విత్తిన పెసర, మినుము కోయుట |

**ఉత్తరభాద్ర కార్తె ( 17.03.21 నుండి 30.03.21)**

| | | |
|---|---|---|
| రబీ ఆముదం | : | సస్యరక్షణ, కోతలు |
| గోధుమ | : | ఆలస్యంగా విత్తిన పంట కోతలు |
| వేరుశనగ | : | డిశెంబర్‌లో విత్తిన పంట నుండి కాయ త్రవ్వుట |
| పప్పుదినుసులు | : | పెసర, మినుము కోతలు |
| వరి | : | అశ్వని కార్తెలో వేయబోయే వరిని విత్తుట రబీలో వేసిన వరిని కోయుట |
| మొక్కజొన్న | : | రబీలో వేసిన మొక్కజొన్న కోతలు |

# వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు - రైతాంగ అధిక ఆదాయానికి అవకాశాలు



డా॥ వి. ప్రవీణ్ రావు
**ఉపకులపతి**

భారతదేశ జనాభాలో సగానికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. స్వాతంత్ర్యానంతర కాలంలో మనదేశం వ్యవసాయ ఉత్పత్తుల కోసం (ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు మొ॥) దిగుమతులపై ఆధారపడేది. "హరిత విప్లవం" ద్వారా దేశంలో వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు అధిక దిగుబడినిచ్చే వంగడాలను విరివిగా వాడటం వలన స్వయం సమృద్ధి సాధించగలిగాం. గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో పయనించడంతో మన వ్యవసాయ ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం.

ప్రపంచంలో వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే మొదటి పది దేశాల్లో భారతదేశం తన స్థానాన్ని పదిలపర్చుకొన్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల (స్టాటిస్టికల్) రివ్యూ 2020 ప్రకారం ప్రపంచ వ్యవసాయ ఎగుమతుల్లో మనదేశం వాటా 1.1% (2000) నుండి 2.1% (2019) కి పెరిగింది. భారతదేశ వ్యవసాయ ఉత్పత్తుల్లో బాస్మతి బియ్యం, నాన్ బాస్మతి బియ్యం, పశుమాంసం, వేరుశనగ నూనె, సుగంధ ద్రవ్యాలు, ప్రత్తి, చెక్కర, ఆముదపు నూనె, టీ, సముద్రపు ఉత్పత్తులు, అధిక విదేశీ మారక ద్రవ్యం ఆర్జించే ఉత్పత్తులు. బాస్మతి బియ్యాన్ని ముఖ్యంగా ఇరాన్, సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ దేశాలు మరియు కువైట్ లాంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. అలాగే నాన్ బాస్మతి బియ్యాన్ని నేపాల్, బెనిన్, యునైటెడ్ అరబ్ దేశాలు, సోమాలీయా మరియు గినీ లాంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. పశుమాంసాన్ని వియత్నాం, మలేషియా, ఈజిప్టు, ఇండోనేషియా మరియు ఇరాక్ లాంటి దేశాలకు అదేవిధంగా వేరుశనగను ఇండోనేషియా, వియత్నాం, ఫిలిఫైన్స్, మలేషియా మరియు థాయిలాండ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. నాన్ బాస్మతి బియ్యాన్ని ఇతర దేశాలకు అధిక మొత్తంలో ఎగుమతి చేసేటటువంటి థాయిలాండ్ మరియు వియాత్నం లాంటి దేశాలు ఎక్కువ ధరకు ఇతర దేశాలకు ఎగుమతి చేయడం మరియు లాక్‌డౌన్ సందర్భంగా వారి ఎగుమతులను నిలుపు చేయటం వలన భారతదేశంలోని నాన్ బాస్మతి బియ్యానికి చైనా, బంగ్లాదేశ్ మరియు ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేసే సువర్ణావకాశం కలిగింది.

భారతదేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఎక్కువ భాగం ముడి లేదా సెమీ ప్రాసెస్డ్ ఉత్పత్తులు ఉండటం వలన అనుకున్నంత ఆదాయం పొందలేకపోతున్నాం. సేంద్రీయ ఉత్పత్తుల్లో 2019-20 లో 689 మిలియన్ డాలర్ల విలువ గల్గిన ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసినప్పటికి, విలువాధారిత సేంద్రీయ ఉత్పత్తులకు భారీ అవకాశం కలదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తర ఈశాన్య ప్రాంతం, ఉత్తరాఖండ్ మరియు గోవా రాష్ట్రాలు ప్రధానంగా సేంద్రీయ ఉత్పత్తులను చేపట్టి ఎగుమతి కూడా చేస్తున్నాయి. మన రాష్ట్రం నుంచి అమెరికా, చైనా, రష్యా, యునైటెడ్ అరబ్ దేశాలు మరియు బంగ్లాదేశ్ లాంటి దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువగా ఎగుమతి చేస్తున్నాం. వ్యవసాయ మరియు అనుబంధ ఉత్పత్తులైన ధాన్యం, నాన్ బాస్మతి బియ్యం, పండ్లు మరియు కూరగాయల విత్తనాలు, దోస మరియు జర్కిన్స్, కోళ్ళు, ఇతర తాజా కూరగాయలు, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కోకోవా, గ్రుడ్లు, పాలు మరియు పాల ఉత్పత్తులు, మామిడి, శుద్ధిచేసిన పండ్లు, రసాలు, నట్స్, వేరుశనగ, పువ్వులు, తేనె, గొర్రె/మేక మాంసం, గౌర్ జిగురు, పశు మాంసం లాంటివి మనరాష్ట్రం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. అలాగే మన రాష్ట్రం నుంచి చేపలు, మాంసం, గ్రీన్ హౌస్‌లో పెంచే కూరగాయలను బయటి దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి "ఏపిడా" మన రాష్ట్రంలోని రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ మరియు ఖమ్మం జిల్లాలను ఎగుమతి క్లస్టర్లుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో విరివిగా పండించే వ్యవసాయ ఉత్పత్తులైన మామిడి, పసుపు, మిరప లాంటి పంటల ఎగుమతులకు బాటలు వేస్తున్నది. అలాగే మన రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ పార్కులు, ఆహార గిడ్డంగులు, ప్యాక్‌హౌస్‌లు, శీతల గిడ్డంగులు, ఫ్రీజర్లు, ఇర్రేడియేషన్ యూనిట్లు మొదలగు మౌళిక సదుపాయాల కల్పనకు సబ్సిడీని కూడా అందిస్తున్నది. వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా తమ వంతుగా చిరుధాన్యాల ప్రాసెసింగ్‌లో రైతులకు మరియు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విలువ జోడింపు ద్వారా ఎగుమతులను ప్రోత్సహిస్తూ గ్లోబల్ వాల్యూ చెయిన్‌లో భాగస్వాములను చేయడానికి సహాయపడుతున్నది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులలో ఉన్న అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యువ రైతులు, రైతు ఉత్పత్తి సంస్థలు వినియోగించుకొని అధిక ఆదాయాన్ని అర్జిస్తారని ఆశిస్తూ...



ఉపకులపతి



## వరి

- రాష్ట్రంలో వరి పంట దుబ్బు చేసే దశ నుండి ఈనిక దశల్లో ఉన్నది. డిసెంబర్ మాసంలో నాటిన వరి పంట పూత దశలో ఉంది.
- పైరు అంకురం నుండి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు చివరి దఫా ఎరువులు వేసుకోవాలి. అందుకు గాను ఎకరానికి 35 కిలోల యూరియా మరియు 15-20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను బురద పదునులో పొలంమంతటా సమానంగా చల్లుకోవాలి.
- సాధారణంగా యాసంగిలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉంటుంది. నివారణకు వరి పైరు చిరుపొట్ట దశలో క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- ఫిబ్రవరి మాసంలో వరి పైరు దుబ్బు దశలో వివిధ జిల్లాల్లో రెల్లరాల్చు పురుగు ఆశించి నష్టపరిచింది. కావున ఈనిక దశలో ఉధృతి గమనించినట్లైతే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.1 మి.లీ. లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి. పొలం మంతటా నీరు పెట్టి పురుగు మందులు పిచికారి చేస్తే మంచిది.
- గత కొన్ని సంవత్సరాల నుండి వరి ఈగ ఉధృతి యాసంగిలో గణనీయంగా పెరిగింది. వరి ఈగ ఆశించిన ఆకుల కొనలు తెల్లబడి విరిగిపోవడం మరియు కంకిపై కొన్ని గింజలు తెల్లగా తాలు గింజలుగా మారిపోవడం గమనించవచ్చు. నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మార్చి మాసంలో ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోత వాతావరణ పరిస్థితుల్లో ఆకునల్లి ఆశించి ఆకులు పసుపు రంగుకు మారతాయి. అలాగే ముందుగా వేసిన వరి పంటలో పూత దశ నుండి గింజ పాలు పోసుకొనే దశల్లో కంకి నల్లి ఆశించి నష్టపరిచే అవకాశం ఉన్నది. నివారణకు డైకోపాల్ 5 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కంకినల్లి మరియు పొట్ట కుళ్ళు తెగులు గమనించినట్లైతే స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. + ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మార్చి మాసంలో ఉండే పొడి వాతావరణ పరిస్థితుల్లో ముందుగా నాటిన వరి పంటలో సుడిదోమ ఆశించే అవకాశం ఉంది. కావున పొలాన్ని అడపాదడపా అరగట్టాలి. దోమ ఉధృతి బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా బ్యుప్రోపెజిన్ 1.6 మి.లీ. లేదా డైనోటెఫ్యురాన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ముఖ్యంగా యాదాద్రి భువనగిరి, సూర్యపేట మరియు నల్గొండ జిల్లాల్లోని మూసి ఆయికట్టు క్రింద సాగు చేసే వరి పంటలో యాసంగిలో కాండం కుళ్ళు ఆశించే అవకాశం ఉంది. నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1

**డా॥ పి. రఘు రామి రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (వరి)**
**వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్,**
**ఫోన్ నెం. 7337399470**

## మొక్కజొన్న

యాసంగిలో ముందుగా విత్తుకున్న మొక్కజొన్న పైరు కోతకు సిద్ధంగా ఉంటుంది. పంట పరిపక్వదశకు చేరుకున్నప్పుడు కోత చేపట్టాలి. కండెల పైపొర ఎండి పోవుట, గింజలు వేలిగోరుతో నొక్కినప్పుడు గట్టిగా ఉండి నొక్కులు ఏర్పడకపోవుట, కొన్ని రకాల్లో గింజ అడుగుభాగంలో నల్లటి చార ఏర్పడుట వంటి లక్షణాలను బట్టి పరిపక్వదశను గుర్తించవచ్చు. కొన్ని వంగడాలలో



పక్వదశకు చేరుకున్న పైరు కూడా పచ్చగా ఉండడం గమనించవచ్చు. గింజల్లో 25-30 శాతం తేమ ఉన్నప్పుడు కోతచేపట్టాలి. కోసిన కండెలను ఎండలో బాగా ఆరబెట్టి గింజల్లో సుమారు 15 శాతం తేమ ఉండగా యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలను 2-3 రోజులు ఎండలో 10-12 శాతం తేమ వరకు ఆరబెట్టాలి.

యాసంగిలో ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పైరు పూతదశలో ఉన్నయెడల నీటిని సమృద్ధిగా అందచేస్తూ నాల్గవ దఫా నత్రజని ఎరువును ఎకరాకు 50 కిలోల యూరియా రూపంలోను, రెండవ దఫా పొటాష్ ఎరువు 25 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలోను పైపాటుగా వేయవలెను. కాండం కుళ్ళు తెగులు ఆశించు ప్రాంతాల్లో పూతదశ నుండి పైరు బెట్టకు గురికాకుండా చూడవలెను. పొడతెగులు ఆశించినచో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన 1-2 ఆకులను తీసివేయవలెను. కలుపు లేకుండా శుభ్రమైన పంటసాగును అవలంభించవలెను. ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పొడతెగులును నివారించుకోవచ్చు.

ప్రస్తుత యాసంగి సీజనులో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించడం జరిగింది. పైరు మొకాలు ఎత్తు నుంచి పూతదశకు వచ్చే వరకు పురుగు నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. దీని నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పినటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై మొక్క సుడులు తడిచేటట్లు పిచికారి చేయాలి. ఇసుక మరియు సున్నం కలిపిన మిశ్రమాన్ని 9:1 నిష్పత్తిలో ఎకరానికి 10 కిలోలు మొక్కసుడుల్లో పడునట్లుగా వేయాలి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (మొక్కజొన్న), మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## చిరుధాన్యాలు

**జొన్న:** యాసంగిలో విత్తుకున్న జొన్న పంట కోతకు సిద్ధంగా ఉంటుంది. పంటకోత లక్షణాలు అనగా కంకి క్రింది వరుసలో ఉన్న గింజలు ఆకుపచ్చ రంగు నుండి తెల్లగా మారి గింజ క్రిందిభాగాన నల్లటి చార ఏర్పడినట్లయితే పంట కోత చేపట్టవచ్చు. కోసిన కంకులను పల్చగా ఆరబెట్టి, నూర్పిడి చేసుకొని, గింజలో తేమశాతం 9-10% ఉండేటట్టుగా ఆరబెట్టి, గోనెసంచులలో నింపుకోవాలి.

**సజ్జ:** వేసవి పంటగా జనవరి మాసంలో విత్తుకున్న సజ్జ పంట పూతదశలో ఉంటుంది. ఈ సమయంలో బెట్ట నుండి పంటను కాపాడటానికి 2-3 నీటి తడులు ఇవ్వాలి.

**రాగి:** రాగి పంట కూడా పూతదశలో ఉంటుంది. కావున పంటకు 2-3 నీటి తడులు ఇవ్వాలి. మొక్కల మీద అగ్గితెగులు గమనించినచో 1 గ్రా. కార్బండాజిమ్ లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (చిరు ధాన్యాలు), మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

ఈ యాసంగిలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం గింజ ఏర్పడే మరియు అభివృద్ధి నుండి కోత దశలో ఉంది. కాయ ఏర్పడే దశలో తగినంత తేమ ఉండేట్లు చూసుకోవాలి. ఈ దశలో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. ఈ దశలో ఆకుమచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎకరానికి 400 గ్రా. క్లోరోథలోనిల్ లేదా 200 మి.లీ. టెబ్యుకొనజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. తెగులు ఉధృతిని బట్టి 2 సార్లు పిచికారి చేసుకోవాలి. వేరుశనగ మొక్కలలో 75% కాయలు



పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే కోయాలి. కాయ లోపలి భాగం ముదురు గోధుమ రంగుకు వచ్చినప్పుడు కాయ పక్వానికి వచ్చిందని గుర్తించాలి. నెట్‌పాడ్ లేదా డ్రైపాడ్ త్రెషర్‌తో గంటలో 2.0-2.5 క్వింటాళ్ళ కాయను వేరుచేయవచ్చు. కోత తరువాత పంటను కట్టలుగా కట్టి నీడలో ఆరబెట్టాలి. కాయలో 8-9% తేమ వచ్చేంత వరకు నీడలో ఆరబెట్టాలి. ఈ విధంగా చేయడం ద్వారా గింజల మొలకెత్తే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. ఆలస్యంగా సాగు చేసిన వేరుశనగలో కాండం కుళ్ళు తెగులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తెగులును గమనించినప్పుడు 1 మి.లీ. టెబ్యుకొనజోల్ లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచేట్లు పిచికారి చేసుకోవాలి.

## ఆముదం

యాసంగిలో సాగు చేస్తున్న ఆముదం ప్రస్తుతం 90 నుండి 120 రోజుల దశలో ఉంది. పూత మరియు గింజ ఏర్పడే దశల్లో పంట నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. బరువైన నేలల్లో 15 రోజులకొకసారి, తేలిక నేలల్లో 8-10 రోజులకొకసారి నీటి తడులను ఇవ్వడం మంచిది. ఎండలు ఎక్కువ అవడం వలన ఈ మాసంలో రసం పీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అదే విధంగా కాయ తొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నట్లయితే బూజు తెగులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నివారణకు 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులును గమనించినట్లయితే 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి చెట్టు మొదళ్ళు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి.

## నువ్వులు

ప్రస్తుతం నువ్వుల పంట 30-45 రోజుల దశలో ఉంది. ఈ దశలో పూత మరియు కాయ ఏర్పడడం జరుగుతుంది. కాబట్టి ఈ దశలో నువ్వుల పంటకు నీటి తడులు ఇవ్వాలి. అవసరమైన దానికంటే ఎక్కువ తడులు ఇస్తే శాఖీయ పెరుగుదల మాత్రమే జరిగి పూత మరియు కాయ రాకుండా నిలిచిపోతుంది. ఈ దశలో రసం పీల్చు పురుగుల ఉధృతిని గమనించినట్లయితే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. బూడిద తెగులు గమనించినట్లయితే నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

## ప్రొద్దుతిరుగుడు

ప్రొద్దుతిరుగుడు ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉంది. ఈ దశలో 16 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందే నెక్రోసిస్ తెగులు నివారణకు థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అదే విధంగా పొలంలో పార్థీనియం మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఆకర్షక పత్రాలు వికసించే దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటిలో కలిపి పైరుపై పిచికారి చేసుకోవాలి. ఫిబ్రవరి మాసంలో విత్తిన పంటలో ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి పంటను పలుచన చేయాలి. 20-25 రోజుల సమయంలో అంతరసేద్యం చేపట్టాలి.

## కుసుమ

ప్రస్తుతం కుసుమ కోత దశలో ఉన్నది. ఉదయం పూట పంటను కోయడం వలన గింజ తక్కువగా రాలటమే కాకుండా ముళ్ళు మెత్తగా ఉంటాయి. కోసిన తరువాత గింజలను 5-8% తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 7207240582**



## అపరాలు

**కంది:** యాసంగి కంది ప్రస్తుతం పరిపక్వత దశ నుండి కోత దశలో ఉంది. 80% పైన కాయలు పరిపక్వత చెందినట్లైతే పంట కోతకు సిద్ధంగా ఉన్నట్లుగా నిర్ధారించి, పంటను కోసి 1-2 రోజులు చేనులోనే ఎండిన తర్వాత పంటను గూళ్ళుగా పెట్టి వారం - పది రోజులకు నూర్పిడి చేసినట్లయితే గింజలోని తేమ చాలా వరకు తగ్గి, నూర్పిడి సులువుగా జరుగును. ఆ తర్వాత గింజలను 9-10% తేమ ఉండే వరకు బాగా ఎండనిచ్చి నిల్వ చేయాలి. కోతకు 3-5 రోజుల ముందు క్వినాల్‌ఫాస్ 25% ఇ.సి. 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో నిల్వలో పురుగు తాకిడిని ముఖ్యంగా బ్రూచిడ్స్ ఆశించకుండా కాపాడవచ్చు. నిల్వ చేసేటప్పుడు బాగా ఎండనిచ్చి ఆ తర్వాత ఏదైనా వంట నూనె 5 మి.లీ. కిలో గింజలకు పట్టించి నిల్వ చేసినచో నిల్వలో పురుగు ఉధృతిని తగ్గించవచ్చును.

### పెసర, మినుము:

**పెసర, మినుములో కలుపు నివారణ:** వరి మాగాణుల్లో ఊద ప్రధాన సమస్య. నివారణకు పైరు విత్తిన 20-25 రోజుల మధ్యలో ఎకరాకు 250 మి.లీ. ఫెనాక్సిప్రాప్-పి-ఇథైల్ లేదా 400 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి ఊదను సమర్ధవంతంగా నివారించుకోవచ్చు. ఊదతో పాటు వెడల్పాటి కలుపు జాతి మొక్కలు ఉన్నట్లయితే ఎకరాకు ఇమాజితాఫిర్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి కలుపును సమర్ధవంతంగా నివారించుకోవచ్చు.

**నీటి యాజమాన్యం:** బెట్ట పరిస్థితుల్లో అవసరం మేరకు కీలక దశల్లో 1-2 తడులు ఇచ్చినచో మంచి దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో నీటి పారుదల క్రింద పండిస్తారు. ఆలస్యంగా విత్తినప్పుడు చివరిలో పైరు బెట్టకు గురయ్యే అవకాశమున్నది. కాబట్టి అవకాశమున్నచోట పైరు పూత దశకు ముందుగా అనగా 30 నుంచి 40 రోజుల వయస్సులో తేలికపాటి నీటి తడి ఇవ్వవలెను. సాధారణంగా పంట కాలానికి 300-450 మి.మీ. నీరు అవసరం ఉంటుంది.

**కీలక దశలు:** పూత మరియు కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి. బెట్ట పరిస్థితుల్లో 2 శాతం (20 గ్రా. లీటరు నీటికి) యూరియా ద్రావణాన్ని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సార్లు పిచికారి చేయాలి.

### సస్యరక్షణ:

#### పురుగులు

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేయవలెను.

**తామర పురుగులు:** ఈ పురుగులు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగ చేయటమే కాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింపచేస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగులు:** పూత, పిందె దశల్లో ఉన్న పంటలో "మారుకా" గూడు పురుగు ఆశించే అవకాశము ఉంది. పంటలో 35 రోజుల వయస్సులో వేప సంబంధిత మందులు (వేపనూనె/వేపగింజల కషాయం) పిచికారి చేసినట్లయితే రెక్కపురుగులు గ్రుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పూత సమయంలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.0



మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి పిచికారి చేసుకోవాలి. పైరులో గూళ్ళు ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు. పురుగు ఎక్కువగా ఉన్నట్లయితే క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్.సి. 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు. అవసరమైతే పురుగుల ఉధృతిని బట్టి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**తెగుళ్ళ యాజమాన్యం:** సాధారణంగా కోరినోస్పోరా ఆకుమచ్చ తెగులు, బూడిద, త్రుప్పు మరియు సర్కోస్పోరా తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్ధవంతంగా అరికట్టటానికి పైరు 30-35 రోజుల వ్యవధిలో లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకొనజోల్ మరియు 50-55 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. పల్లాకు తెగులు, ఆకుముడత తెగులు మరియు సీతాఫలం తెగులు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి మొక్కలను పీకివేసి తెగులు వ్యాప్తికి కారకాలైన రసం పీల్చు పురుగులను నివారించాలి.

**శనగ:**

**పంటకోత:** పంట పరిపక్వత దశకు చేరిన తర్వాత ఆకులు మరియు కాయలు పసుపు రంగుకు మారి ఆ తర్వాత వరి గడ్డి రంగుకు మారును. ఆకులు పూర్తిగా రాలిపోయి మొక్కలు ఎండిపోవును. మొక్కలను మొదలు వరకు కోసి కుప్పగా వేసుకొని ట్రాక్టర్‌తో తొక్కించి లేదా కర్రలతో కొట్టి కాయల నుండి గింజలను వేరు చేయాలి. యాంత్రీకంగా కంబైండ్ హార్వెస్టర్‌తో కూడా పంటను కోయవచ్చును.

**కోతానంతర జాగ్రత్తలు:** పంట కోసిన తర్వాత గింజలు తగినంతగా ఎండు వరకు ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలతో కాని, చేతితో కాని నూర్చుకోవచ్చు. దుమ్ము, దూళి, తాలు గింజల విత్తనాలను తొలగించి నిల్వ చేయాలి. నిల్వ చేయడానికి విత్తనాలలో తేమ 9 శాతం మించకుండా చూడాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, సీనియర్ శాస్త్రవేత్త & హెడ్ (అపరాలు) వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## చెఱకు

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చెఱకు పంటను రైతులు నాటడం పూరైంది. అలాగే కొన్ని ప్రాంతాలలో నాటును కొనసాగిస్తున్నారు. నాటు పెట్టిన చెఱకు తోటలు ఇప్పుడు బాల్యదశ నుండి పిలక దశలో వృద్ధి చెందుతున్నాయి. అదేవిధంగా ఈ సారి ఎక్కువ విస్తీర్ణంలో మోడెం తోటలని రైతులు సాగు చేస్తున్నారు.

బాల్యదశలో పంటకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉంటే మొక్క మరియు మోడెం తోటలలో ఎక్కువ పిలకలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఈ దశలో పంట నీటి ఎద్దడికి గురైతే, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పిలకల సంఖ్య తగ్గి దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది.

ఈ సందర్భంగా ఆలస్యంగా నాటుకునే చెఱకు తోటలలో నీటి ఎద్దడిని తట్టుకునే రకాలు అయిన 83 ఆర్ 23, 85 ఆర్ 186, కో 95020 సాగు చేసుకోవాలి. విత్తనాన్ని సున్నపు నీటితో శుద్ధి చేసుకొని నాటుకుంటే పంట మొదటి దశలో ఎదురయ్యే నీటి ఎద్దడిని అధిగమించవచ్చు.

మోడెం తోటలలో నీటి ఎద్దడి కారణంగా ఖాళీలు ఎక్కువగా ఏర్పడినప్పుడు, అదే రకానికి చెందిన మూడు కళ్ళ



ముచ్చెలను గాని, పాలిథీన్ సంచులలో పెంచిన ఆరు వారాల వయసు గల మొలకలను గాని, మొక్క తోటలలోని దుబ్బులను గాని ఉపయోగించవచ్చు. మోడు చెక్కిన వారం-పది రోజుల లోపు ఖాళీలను నింపి దుబ్బులు బ్రతికే వరకు నీటి వసతి కల్పించి సంరక్షించుకోవాలి. దీని వలన పిలకలు త్వరగా తొడిగే అవకాశం ఉంటుంది. మోడెం సాగులో పాత వేర్లు కత్తిరించడానికి మొదళ్ళ ఇరుప్రక్కల ఎడ్లనాగలితో చీరడం వలన పిలకలు వృద్ధి చెంది త్వరగా ఎదుగుతాయి. అలాగే మోడెం తోటలకు పోషకాల అవసరం కూడా ఎక్కువగా ఉంటుంది. కావున మోడు చెక్కిన వెంటనే 40 కిలోల భ్పాసరం మరియు 48 కిలోల పొటాష్‌ను అందించే ఎరువులను వేసుకొని తడి పెట్టుకోవాలి. మొక్క తోట కంటే 25 శాతం అధికంగా నత్రజనిని వేసుకోవాలి.

ఆలస్యంగా నాటిన చెఱకు తోటలకు మరియు మోడెం సాగులో సూక్ష్మధాతువులైనటువంటి ఇనుము, జింకు మరియు మాంగనీసు లోపాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇనుప ధాతువు లోపం వల్ల ఆకులు పాలిపోయి లేత పసుపు నుండి తెలుపు రంగుకు మారుతాయి. లోపం ఎక్కువగా ఉన్నప్పుడు లేత ఆకులు పూర్తిగా తెల్లగా మారతాయి. ఇటువంటి పరిస్థితిలో లీటరు నీటికి 10 గ్రా. అన్నభేదిని, ఒక బద్ద నిమ్మకాయ లేదా 2 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి వారం-పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

జింకు లోపం కనిపించిన మొక్కలలో ఆకుల వెంబడి పసుపు చారలు ఏర్పడి లోపం ఎక్కువైనప్పుడు పెరుగుదల నిలిచిపోతుంది. దుబ్బు చేయడం ఆగిపోయి కోత పిలకలు నిర్వీర్యం అవుతాయి. ఈ లోపం నివారణకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. ముందస్తుగా ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ వేసినట్లైయితే ఈ సమస్యను సమర్ధవంతంగా అరికట్టవచ్చు.

చెఱకు మధ్య ఆకుల్లో పాలిపోయిన పసుపు రంగుతో కూడిన ఆకుపచ్చ లేదా తెలుపు రంగు చారలు ఈనెల ప్రక్కన కనబడితే అది మాంగనీసు లోపంగా రైతులు గుర్తించాలి. ఈ లోపం ఉధృతి ఎక్కువైనప్పుడు తెల్లగా మారిన ఆకు భాగాల్లో కుళ్ళు మచ్చలు వచ్చి ఆకులు నిలువుగా చీలినట్లు కనబడతాయి. ఈ లోపం నివారణకు ఎకరానికి 2.5 కిలోల మాంగనీసు సల్ఫేట్‌ను 450 లీటర్ల నీటిలో కలిపి దెబ్బతిన్న పంటపై పిచికారి చేయాలి.

**డా॥ యం. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్(చెఱకు), ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, ఫోన్ నెం. 9949437035**

**వ్యవసాయ మాసప్రతిక**

సంవత్సర చందా రూ. 200/-
జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/-
నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే
Principal Agricultural Information Officer,
AI&CC and PJTSAU Press
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే
విధంగా పంపించాలి

**వివిధ పంటల నాశించు చీడపీడలు-వాటి నివారణ, రోగ నిర్ధారణ ప్రచురణలు-వాటి ధరలు**

| | | | |
|---|---|---|---|
| వరి | - రూ. 50.00 | మొక్కజొన్న | - రూ. 50.00 |
| వేరుశనగ | - రూ. 40.00 | ఆముదం | - రూ. 40.00 |
| సోయాచిక్కుడు | - రూ. 40.00 | ప్రత్తి | - రూ. 50.00 |

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ జి. శ్రీనివాస్
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

ఈ సంవత్సరం నైరుతి ఋతుపవనాలు జూన్ 1వ తేదీన కేరళ తీరాన్ని తాకాయి. తెలంగాణా రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు జూన్ 11 వ తేదీన ప్రవేశించి జూన్ 12 వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. తెలంగాణా రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాల కాలంలో (01.06.2020 నుండి 30.09.2020) సాధారణ వర్షపాతం 720.4 మి. మీ. గాను 1078.3 మి.మీ. అనగా 50 శాతం సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనది. నైరుతి ఋతుపవనాలు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుండి అక్టోబర్ 26వ తేదిన మరియు అక్టోబర్ 28వ తేదిన పూర్తిగా నిష్క్రమించాయి.

రాష్ట్రంలో 01-10-2020 నుండి 31-12-2020 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 125.0 మి. మీ. గాను 179.4 మి.మీ. అనగా 44 శాతం సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనది. రాష్ట్రంలో 01-01-2021 నుండి 28-02-2021 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 11.4 మి. మీ. గాను 4.2 మి.మీ. అనగా - 63 శాతం సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైనది.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న, సజ్జ మరియు మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చును. వరి మాగాణుల్లో జొన్న, సజ్జ, మొక్కజొన్న, పిల్లిపెసర, జనుము మరియు ఉలవలు వేసుకోవచ్చును.
- వరిలో అగ్గి తెగులు (మెడ విరుపు) నివారణకు పైరు నిండు పొట్ట దశలో ఉన్నప్పుడు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రోథయోలిన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై బాగా తడిసేటట్లు పిచికారి చేయాలి.
- వరిలో కాండంకుళ్ళు తెగులు గమనించినట్లైతే నివారణకు పొలంలో నీటిని తీసివేసి మొక్కల మొదళ్ళు తడిచేలా 2 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లేదా 2 మి.లీ. వాలిడామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మామిడిలో తేనె మంచు పురుగులు మరియు పక్షి కన్ను తెగులు గమనించినట్లైతే నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ ం 1 గ్రా. కార్బండాజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ప్రస్తుత పరిస్థితులలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వలన తామర పురుగుల ఉధృతి పెరిగి టమాట స్పాటెడ్ విల్ట్ వైరస్ తెగులు వ్యాపించే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయవలెను. తామర పురుగుల నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 2 మి.లీ. మిథైల్-డెమటాన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ప్రస్తుత పరిస్థితులలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వలన కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్లైతే నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కోళ్ళ వేడి వాతావరణాన్ని తట్టుకొనుటకు షెడ్లల్లో ఫ్యాన్లను మరియు ఫాగార్స్‌ను అమర్చి షెడ్లను వరిగడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి. కోళ్ళు ఎక్కువ మోతాదులో తినుటకు అనుగుణంగా మెత్తటి దాణాను పెట్టి త్రాగుటకు చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి.
- అధిక ఉష్ణోగ్రతల వలన పాలలో వెన్న శాతం తగ్గకుండా ఉండుటకు పాలిచ్చు ఆవులు మరియు గేదెలకు పూత దశలో ఉన్న పశుగ్రాసాలను మేతగా వేయవలెను.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9989625231

# యాసంగి వరిలో చిరుపొట్ట దశలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు

డా|| టి. కిరణ్ బాబు, డా|| ఎన్. ఆర్.జి. వర్మ, డా|| పి. స్పందన, డా|| వై. చంద్రమోహన్,
డా|| ఎల్. కృష్ణ మరియు డా|| పి. రఘురామి రెడ్డి
వరి పరిశోధనా కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

యాసంగిలో సాగుచేస్తున్న పంటల్లో వరి ప్రధానమైన పంట. వరిని తెలంగాణ రాష్ట్రంలో సుమారు 50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో యాసంగిలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట ఎక్కువ శాతం అంకురం ఏర్పడే దశ నుండి చిరుపొట్ట దశలో ఉన్నది. ఈ దశలో చేపట్టాల్సిన యాజమాన్య చర్యలను రైతులకు సూచించడమైనది. చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలో రైతులు పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను చాలా జిల్లాల్లో వేస్తున్నారు. ముఖ్యంగా భాస్వరం ఎరువును పైపాటుగా చిరుపొట్ట దశలో రైతులు వేస్తున్నారు. ఈ విధంగా (20-20-0-13, 28-28-0) వేయటం వలన సాగు, ఖర్చు గణనీయంగా పెరుగుతుంది. కావున వరి పంట చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు ఎకరానికి 30-35 కిలోల యూరియా మరియు 15-20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను మాత్రమే పైపాటుగా వేయాలి. పొటాష్ ఎరువును ఆఖరి దఫాగా వేయటం వలన మొక్కలలో రోగ నిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా గింజ నాణ్యత కూడా పెరుగుతుంది.



యాసంగి వరిలో ముఖ్యంగా రంగారెడ్డి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మెదక్, కరీంనగర్, జగిత్యాల, కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో అగ్గి తెగులు (ఆకుమచ్చ దశ) ఉధృతి ఎక్కువగా గమనించడం జరిగింది. యాసంగిలో సాగు చేస్తున్న అన్ని రకాలలో (ఒక్క తెలంగాణ సోన తప్ప) అగ్గి తెగులు ఆశించి నష్టపరుస్తుంది.

**అగ్గి తెగులు ఆశించడానికి గల ప్రధాన కారణాలు**

- అనుకూల వాతావరణ పరిస్థితులు(గాలిలో అధిక తేమ శాతం మరియు రాత్రి ఉష్ణోగ్రతల్లో తగ్గుదల). వరి పైర్లు సరిగా ఎదగటం లేదని అధిక మొత్తంలో నత్రజని వేయడం వలన అగ్గి తెగులు ఉధృతి ఎక్కువ అవుతుంది. శిలీంధ్రము పాథోటైప్‌లో మార్పులు జరగటం వలన. హైబ్రిడ్ విత్తనోత్పత్తిలో మగ మరియు ఆడ విత్తన రకాలలో ఏదో ఒకటి అగ్గి తెగులు తట్టుకొనే శక్తి లేకపోవటం. తెగులు లక్షణాలను గమనించినప్పుడు కూడా యూరియాను పైపాటుగా వేయటం
- పొలం గట్లపైన మరియు పొలంలో కలుపు మొక్కలు ఉండటం

**ప్రస్తుతం చేపట్టవలసిన నివారణ చర్యలు :** అగ్గి తెగులును ఆకుమచ్చ దశలో నివారించకపోతే తర్వాత దశలో మెడవిరుపు ఆశించి అధిక నష్టాన్ని కలుగజేస్తుందని రైతులు గమనించాలి.

- వరి పైరు చిరుపొట్ట దశలో ఆకుమచ్చ లక్షణాలు గమనించినట్లైతే ఆఖరి దఫా నత్రజని ఎరువులను కొన్ని రోజులు తాత్కలికంగా నిలిపివేయాలి. మొక్కలలో రోగనిరోధక శక్తిని పెంపొందిచడానికి పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానికి 15-20 కిలోలు వేయాలి. ఆకుమచ్చ లక్షణాలు గమనించినట్లైతే ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తెగులు ఉధృతి అధికంగా ఉన్నట్లైతే పికాక్సిస్ట్రోబిన్ 6.78% +ట్రైసైక్లోజోల్ 20.33% ఎస్.సి. 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 10.7% + ట్రైసైక్లోజోల్ 34.2% ఎస్.ఈ 1.0 మి.లీ. లేదా పైరాక్లోస్ట్రోబిన్ 100 గ్రా. సి.యస్. 2 మి.లీ. లేదా ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ + టెబుకొనజోల్ 0.4 గ్రా. లీటరు నీటికి 7-10 రోజుల వ్యవధిలో రెండు సార్లు మందులు మార్చి పిచికారి చేయాలి.
- అగ్గి తెగులు ఉధృతి గమనించినప్పుడు పొలాన్ని ఆరబెట్టినట్లైతే ఉధృతి ఇంకా అధికమవుతుంది. కావున పొలంలో సమానంగా నీరు ఉండేటట్లు చూడాలి.

**కాండం తొలుచు పురుగు :** చిరుపొట్ట దశలో ఉన్న యాసంగి వరి పంటలో కాండం తొలిచే పురుగు అధికంగా ఆశించే అవకాశం ఉంది. కంకులు బయటకు వచ్చే సమయంలో తెల్ల కంకులు ఏర్పడి రైతులకు అధిక నష్టాన్ని కలుగచేస్తుంది. చిరుపొట్ట దశలో ఉన్న వరి పైర్లలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% ఎస్.పి. 2 గ్రా. నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ దశలోనే కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి. తర్వాత దశల్లో పురుగు మందులు పిచికారి చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలి.

# మొక్కజొన్న పంటకోతలో పాటించవలసిన మెళకువలు

డా॥ డి. భద్రు, డా॥ బి. మల్లయ్య, డా॥ డి. శ్రీలత మరియు డా॥ యం.వి. నగేశ్ కుమార్
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి కాలంలో మొక్కజొన్నను 4.10 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరుగుచున్నది. ముఖ్యంగా ఈ పంటను నిర్మల్, వరంగల్, సిద్ధిపేట్, నిజామాబాద్, ఖమ్మం, జగిత్యాల్, కరీంనగర్ మరియు కామారెడ్డి జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మొక్కజొన్నను గింజల కోసం, తీపి కండెల కోసం (స్వీట్ కార్న్), పాప్ కార్న్ మరియు బేబీ కార్న్ కొరకు సాగుచేస్తారు. రైతులు వివిధ రకాల మొక్కజొన్నలో సరియైన కోత దశలను గుర్తించి కోసినట్లయితేనే మార్కెట్‌లో మంచి ధర పలకడంతో పాటు అధిక లాభాలను పొందవచ్చు. సాధారణంగా బేబి కార్న్ అంటే ఫలదీకరణం చెందని మొక్కజొన్న కండె. పీచు తొలి దశలో గింజ కట్టక ముందే కోసిన మొక్కజొన్న కండెలను బేబి కార్న్ అంటారు. బేబి కార్న్ కూరగాయగా ప్రాచుర్యం పొందుచున్నది. అలాగే పట్టణ పరిసర ప్రాంతాలలో తీపి మొక్కజొన్న కండెలకు బాగా గిరాకీ ఉంటుంది. గింజ పాలు పోసుకునే దశలో సాధారణ మొక్కజొన్న కండెలతో పోలిస్తే తీపి మొక్కజొన్న కండెలలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది (25-30%) మరియు పోషక విలువలు కూడా ఎక్కువ. తీపి కండెను అవసరాన్ని బట్టి లేదా అనివార్య పరిస్థితులలో బేబీ కార్న్‌గా కూడ మార్కెట్ చేసుకోవచ్చు. గింజ కోసం సాగు చేసే మొక్కజొన్నలో కండె తొలి దశలో నీటి తడులు ఇవ్వలేని పక్షంలో బేబి కార్న్ గా (50 రోజుల్లో) కోసుకొని మరియు గింజ పాలు పోసుకునే దశలో నీటి తడులు ఇవ్వలేని పక్షంలో పచ్చి కండెలుగా (80-85 రోజుల్లో) కోసుకొని మార్కెట్ చేసుకోవడం వలన రైతులు పూర్తిగా నష్టపోకుండా జాగ్రత్త పడవచ్చు.

**గింజ కోసం సాగు చేసే మొక్కజొన్న:** పంట కోతకు వచ్చినప్పుడు పక్వ దశను గమనించి కండెలను కోయాలి. పక్వ దశను క్రింది విధముగా గుర్తించాలి.

- కండెల పైపొరలు ఎండినట్లు పసుపువర్ణంలో కనిపిస్తాయి.
- బాగా ఎండిన కండెలు మొక్కల నుండి క్రిందికి వేలాడుతూ కనిపిస్తాయి.
- కండెలలోని గింజలను వేలి గోరుతో నొక్కినప్పుడు గట్టిగా వుండి నొక్కులు ఏర్పడవు.
- కండెలోని గింజలను తీసి వాటి అడుగుభాగం పరీక్షించినచో (కొన్ని రకాలలో) నల్లని చారలను గమనించవచ్చు.

కోసిన కండెల గింజల్లో తేమ శాతం 25-30 ఉంటుంది. కాబట్టి తేమ 12-15 శాతంకు తగ్గే వరకు కండెలను వారం రోజుల పాటు ఎండబెట్టాలి. తరువాత కండెలను నూర్పిడి చేయుటకు (గింజలను కండె నుండి వేరు చేయుట) కర్రలు లేదా నూర్పిడి యంత్రాలను ఉపయోగించవచ్చు. నూర్పిడి తరువాత గింజల్లో తేమ శాతం 9-10 ఉండేటట్లు 2-3 రోజులు బాగా ఆరబెట్టాలి. ఈ విత్తనాలను గోనె సంచులలో లేదా పాలిథీన్ సంచులలో భద్రపరచి చల్లని, తక్కువ తేమ గల ప్రాంతంలో నిల్వ చేయాలి. నిల్వలో గింజలకు తేమ తగలకుండా, ఎలుకలు, పురుగులు లేదా శిలీంధ్రాలు మొదలగునవి ఆశించకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**తీపి మొక్కజొన్న:** తీపి మొక్కజొన్నలో పరపరాగ సంపర్కం జరిగిన మూడు వారాల తర్వాత గింజలు చాలా తీయగా ఉంటాయి. కొంచెం ఎండిన పీచు, కండెపైన బిగుతుగా ఉన్న ఆకు పచ్చని పొట్టు మరియు బాగా పెరిగిన కండె పరిమాణాన్ని బట్టి కోతకు సరైన సమయమని గుర్తించవచ్చు. గింజలు మెరుస్తూ, బాగా పెరిగి, గిల్లినచో పాలు కారును. చక్కర శాతం గింజ పాలు పోసుకునే దశ నుంచి 10 రోజుల వరకు స్థిరపడి తరువాత క్రమంగా తగ్గుతుంది. కావున రైతాంగం ఈ 10 రోజులలో నాణ్యతతో కూడిన కండెలను ఒకేసారి కాకుండా దఫాలుగా కోసి మార్కెట్ చేసుకోవలెను. దీనికి తోడుగా తీపి మొక్కజొన్నను దఫాలుగా విత్తుకోవడం వలన పంట ఒకేసారి కోతకు వచ్చి వృధా కాకుండా దఫాలుగా మార్కెట్ చేసుకోవచ్చు.

కోత ఆలస్యం చేయడం వలన గింజలోని తీపిదనం తగ్గుతుంది. అందుకే కండెలను కోసిన వెంటనే 1-2 రోజుల లోపు వినియోగించుకోవాలి. తీపి మొక్కజొన్నను కోసిన వెంటనే పొలం నుంచి షెడ్‌కి తరలించి చెక్క పెట్టెల్లో లేదా అట్టపెట్టెల్లో పెట్టి చల్లని ప్రదేశంలో ($0-4^0$ సెం.గ్రే.) నిల్వ చేయాలి. కండెలను పాలిథీన్ సంచుల్లో పెట్టి మార్కెట్లో అమ్మవచ్చు. అత్యధిక చక్కెర శాతం $27^0$ సెం.గ్రే. దగ్గర 2 రోజులు, $16^0$ సెం.గ్రే. దగ్గర 5 రోజులుంటుంది. కోసిన తర్వాత తీపిదనం చాలా త్వరగా తగ్గుతుంది. కోసిన ఒక రోజులో $0^0$ సెం.గ్రే. లో 8 శాతం, $30^0$ సెం.గ్రే. లో 52 శాతం చక్కెర తగ్గిపోతుంది. తరువాత చక్కెర పిండిపదార్థంగా మారుతుంది.

**బేబి కార్న్:** బేబి కార్న్ కండెలను 45-50 రోజులప్పుడు పీచు 2-3 సెం.మీ. ఉన్నప్పుడు అంటే పీచు వచ్చిన 1-3 రోజులకు కోయాలి. కోత ఆలస్యం చేసినట్లయితే కండెలు ఒక్క రోజులోనే గట్టిపడి, కండెలలో పలు రసాయనిక మార్పులు, విత్తనాల అంకురార్పణ జరిగి బేబి కార్న్‌గా ఉపయోగించేందుకు పనికిరావు. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వేడి తక్కువగా ఉన్నప్పుడు కోసిన యెడల కండెల నాణ్యత బాగుండును. యాసంగిలో రోజు విడిచి రోజు పంట కోత చేపట్టాలి. ముందుగా మొక్కలలో పైనున్న బేబి కార్న్‌ను కోసి తరువాతి రోజు క్రిందవి కోయాలి. వేసుకునే రకాన్ని బట్టి మొత్తం 7-8 కోతల వరకు తీసుకోవచ్చు.

కోసిన కండెలపైన వున్న పీచు తీసివేసి శుభ్రం చేయాలి. పై పొర తీసి మార్కెటింగ్ చేయునప్పుడు కండెలు విరగకుండా జాగ్రత్తపడాలి. కండెలను సైజు వారిగా వేరు చేసి ప్యాకింగ్ చేసుకోవాలి. వీటిని $10^0$ సెం.గ్రే. వద్ద 3-4 రోజుల వరకు నిలువ చేసుకోవచ్చు. ఒలిచిన కండెలు 6.0-11.0 సెం.మీ. పొడవు మరియు 1.0-1.5 సెం.మీ. మందంతో ఉన్నప్పుడు మంచి ధర పొందవచ్చు.

బేబి కార్న్‌పై తీసివేసిన పై పొరను మరియు కోత కోసిన మొక్కలను పచ్చిమేతగా ఉపయోగించుకొని అదనపు ఆదాయాన్ని పొందవచ్చును.

**పేలాల మొక్కజొన్న:** కండెపైపొరలు ఎండిపోయి, గింజ అడుగు భాగంలో నల్లటి చార ఏర్పడినప్పుడు పైరు పక్వ దశకు చేరుకొన్నట్లు భావించాలి. గింజలో తేమ 30-35 శాతం ఉన్నప్పుడు కండెలను మొక్కల నుండి వేరు చేసి నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టినట్లయితే గింజలు పగిలి పేలాలు సరిగ్గా తయారుకావు. గింజలో తేమ శాతం 12-14 కు మించకుండా ఉండి సరైన సమయంలో కండెలు కోయడం వలన గింజలు దెబ్బతినకుండా, నాణ్యమైన పేలాలు తయారవడమే కాకుండా మంచి గిట్టుబాటు ధర పొందవచ్చు. గింజలను మంచి గాలి తగిలే గోదాముల్లో అంటే గాలిలో తేమ శాతం 70 కి తగ్గకుండా ఉంచడం వల్ల ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు.

పైన చెప్పిన విధంగా వివిధ రకాల మొక్కజొన్నను సరైన సమయంలో కోత చేపట్టి రైతాంగం అధిక ఆదాయాన్ని పొందాలని ఆశిస్తున్నాం.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 8008572006**



# వేసవి పెసర మరియు మినుములో సస్యరక్షణ

డా॥ వి. శ్రీధర్, డా॥ టి. స్వర్ణలత దేవీ, వి. శ్రీ రమ్య మరియు జి. స్వాతి
వ్యవసాయ పాలిటెక్నిక్, కంపాసాగర్, నల్గొండ

మన రాష్ట్రంలో వేసవిలో సాగుచేసే అపరాలలో పెసర, మినుము ముఖ్యమైనవి. సుమారు 60 రోజుల నుంచి 90 రోజుల వరకు కోతకు వచ్చే ఈ పంటలు దాదాపుగా 1.50 లక్షల హెక్టార్లలో సాగు చేయబడుతున్నాయి. వేసవిలో వేసిన ఈ పంటలు ప్రస్తుతం శాఖీయదశ నుండి పూత, పిందె దశలలో ఉన్నవి. ఈ దశల్లో వివిధ రకాల చీడపీడలు ఆశించి పంటను దెబ్బతీసే అవకాశముంటుంది. ఇటువంటి ప్రతికూల కారణాల వలన ఆశించిన మేర దిగుబడి రాకపోవడం జరుగుతుంది. రైతు సోదరులు సరైన సస్యరక్షణ చర్యలు పాటించినట్లైతే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు.

**తొలిదశలలో ఆశించే పురుగులు :**

**చిత్త పురుగులు :** ఈ పురుగులు మొక్క రెండాకుల దశలో ఎక్కువగా ఆశించడం వలన మొక్కల్లో పెరుగుదల లేక మొక్కలు చనిపోవడం జరుగుతుంది. ఈ పురుగులు ఆకులపై చేసే గుండ్రని రంధ్రాలను గమనించడం ద్వారా వాటి యొక్క ఉనికిని గుర్తుపట్టవచ్చును.

**తెల్లదోమ :** వీటి యొక్క రెక్కల పురుగులు మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగాన ఉండి రసం పీల్చడం ద్వారా ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. ముఖ్యంగా రసాన్ని పీల్చడమే కాక జెమిని వైరస్ వలన కలిగే పల్లాకు తెగులు వ్యాప్తికి కారణమవుతుంది.

**తామర పురుగులు :** పైరు తొలిదశలో తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు వంకరలు తిరుగుతాయి. పంట తొలిదశలో ఈ పురుగుల యొక్క తీవ్రత ఎక్కువగా ఉన్నట్లైతే మొక్కలు ఎండిపోవడం కూడా జరుగుతుంది. మరొక వైపు ఆకుముడత అనే వైరస్‌ను కూడా వ్యాపింపజేస్తాయి. కొన్ని సందర్భాలలో ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కల యొక్క పెరుగుదల ఆగిపోయి గిడసబారుతాయి.

**పేనుబంక :** తల్లి మరియు పిల్ల పురుగులు ఆకులు, కొమ్మలు, పూత మరియు పిందెలపై గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చడం వలన మొక్కలు గిడసబారిపోతాయి. ఈ పురుగు తేనె వంటి పదార్థాన్ని విసర్జించుట వలన దానిపై నల్లటి బూజు ఏర్పడి కిరణ జన్య సంయోగక్రియ సరిగా జరగక మొక్కలలో పెరుగుదల ఆగిపోతుంది. అంతేకాకుండా ఈ పురుగులు సీతాఫలం తెగులు (బొబ్బరి తెగులు) అనే వైరస్ వ్యాధిని వ్యాపింపజేస్తాయి.

**సస్యరక్షణ చర్యలు :**

**విత్తనశుద్ధి :** ముఖ్యంగా రసం పీల్చే పురుగుల నివారణకు విత్తనశుద్ధి చేసుకుంటే పంట తొలిదశలలో వచ్చే చిత్తపురుగులు మరియు రసం పీల్చే పురుగులను అరికట్టడమే కాకుండా వాటి ద్వారా వ్యాపించే వైరస్ తెగుళ్ళను నివారించుకోవచ్చు.

**విత్తనశుద్ధి మందులు :** ఇమిడాక్లోప్రిడ్ ఎఫ్.ఎస్ 600 లేదా థయోమిథాక్సామ్ 70 డబ్ల్యుఎస్ లేదా మోనోక్రోటోఫాస్ 5 మి.లీ. కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తుకోవాలి.

**పురుగు మందులు**

| పురుగు | పురుగు మందు ఒక లీటరు నీటికి |
|---|---|
| చిత్త పురుగులు | ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ. |
| తామర పురుగులు | ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. |
| తెల్లదోమ | ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. |
| పేనుబంక | ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. |

పైన చెప్పిన పురుగు మందులను ఉధృతిని బట్టి వారం నుండి పదిరోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

**మారుకామచ్చల పురుగు :** ఈ మధ్య కాలంలో మారుకామచ్చల పురుగు బారిన పడినటువంటి పెసర, మినుము, కంది పంటల్లో దాదాపుగా 80-90% నష్టం జరిగినట్టు గమనిస్తున్నాం. తల్లి పురుగుకు ముందు రెక్కలపై తెల్లటి గది ఆకారపు మచ్చలుంటాయి. ఒక్కొక్క తల్లి పురుగు సుమారుగా 4-5 రోజుల వ్యవధిలో 200 వరకు గ్రుడ్లు పెడుతుంది. 4-5 రోజులలో గ్రుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులు పూమొగ్గలలోకి చొచ్చుకుపోతాయి. లేత భాగాలను తింటూ ఉంటాయి. తరువాత దశలలో లేత ఆకులను, మొగ్గలను, పూతలను, పిందెలను మరియు కాయలను కలిపి గూడుగా చేసుకొని లోపలి పదార్థాలను తింటుంది.

కాయ తొలిదశలో కాయ అడుగుభాగాన రంధ్రం చేసుకొని లోపలికెళ్ళి గింజలను తినివేయడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుంది. ఈ పురుగు గూడు లోపలే ఉండి తినడం వలన పురుగు మందుల ప్రభావం నుండి తప్పించుకొనుటకు అవకాశమున్నది. కావున సరైన సమయంలో గుర్తించినట్లైతే దాదాపుగా 80-90% వరకు పంటనష్టం కలిగే అవకాశముంది.

**యాజమాన్యం:** పూత దశలో 5% వేపగింజల కషాయం లేదా 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే తల్లి పురుగు గ్రుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పిల్ల పురుగులు కనిపించినట్లైతే వెంటనే థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఒకవేళ పంటలో గూళ్ళు గమనించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా గమనించినప్పుడు ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పొగాకు లద్దె పురుగు :** తల్లి పురుగులు ఆకు అడుగుభాగంలో దాదాపుగా 400 వరకు గ్రుడ్ల సముదాయాలను పెడుతుంది. తొలిదశలో పిల్లపురుగులు ఆకులలోని పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకులు జల్లెడగా మారిపోతాయి. ఈ పిల్ల పురుగులు పెద్దవై ఆకులను, పూతను, పిందెలను, కాయలను తినివేస్తాయి. పెద్ద లద్దెపురుగులు పగటి పూట నేల మీద ఉండి రాత్రి పూట పైరుకు నష్టం చేస్తాయి.

**యాజమాన్యం :** పంట మధ్యలో అక్కడక్కడ ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు పెట్టినట్లైతే తల్లి పురుగు ఉధృతిని గమనించుకోవచ్చు. పంట మధ్యలో అక్కడక్కడ ఆముదం మొక్కలు వేసుకున్నట్లైతే ఆకుల అడుగుభాగాన పెట్టిన గ్రుడ్ల సముదాయాన్ని ఆకులతో సహా తీసి నాశనం చేసుకోవచ్చు. పురుగు తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి. ఒకవేళ లద్దెపురుగులు బాగా పెద్దవై ఉధృతి


చిత్త పురుగులు


పేనుబంక

ఎక్కువగా ఉన్నప్పుడు విషపు ఎరను తయారు చేసుకొని సాయంత్రం వేళలో మొక్క మొదలు దగ్గర పడేటట్లు చిన్న చిన్న ఉండలుగా చేసుకొని చల్లుకోవాలి.

**విషపు ఎర తయారీ :** 10:1:1- 10 కిలోల తౌడు + 1 లీ. మోనోక్రోటోఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ + 1 కిలో బెల్లం సరిపోయే నీటితో మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా తయారుచేయాలి.

బెల్లాన్ని పాకం చేసి పురుగు మందుకు కలుపుకున్నట్లైతే ఫలితాలు చాలా బాగుంటాయి.

## తెగుళ్ళు

**పల్లాకు తెగులు (ఎల్లో మొజాయిక్ తెగులు) :** ఈ తెగులు వలన 95% వరకు పంట నష్టం కలిగే అవకాశముంది. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. మొదట ఈ తెగులు పసుపు రంగు మచ్చలుగా లేత ఆకుల మీద కనిపిస్తుంది. క్రమేపి మచ్చలు పెరిగి పసుపు ఆకుపచ్చ చారలుగా ఏర్పడతాయి. మొజాయిక్ ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు, పిందెలు, కాయలు పూర్తిగా పసుపు రంగులోకి మారి కాయలు వంకరలు తిరుగుతాయి. ఆకులు పసుపు రంగులో ఉండటం వలన పిండి పదార్థాలు తయారుకాక కాయలలో విత్తనాలు ఏర్పడవు.

**యాజమాన్యం :** తెగులును తట్టుకొనే రకాలు (పెసర : యంజిజి-295, యంజిజి-347, యంజిజి-351, డబ్ల్యుజిజి-42, ఐపియం-2-14; మినుము : పియు-31, యంల్‌బిజి-752, యంల్‌బిజి-787, టిబిజి-104, ఐపియు-2-43) సాగు చేసుకోవాలి. పైరు విత్తే ముందు తప్పనిసరిగా ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ఈ తెగులును వ్యాపింపజేసే రసం పీల్చే పురుగుల నివారణకు పంట చుట్టూ 4 వరుసలు జొన్నగాని, మొక్కజొన్నగానీ వేసుకోవాలి. పొలం చుట్టు ప్రక్కల వైరస్ తెగులు వ్యాపించిన ఇతర మొక్కలను, కలుపు మొక్కలను నాశనం చేయాలి. తెల్లదోమ నివారణకు గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలు ఎకరాకు 20 చొప్పున పెట్టుకోవాలి. తెల్లదోమ నివారణకు తొలిదశలో వేప గింజల కషాయం గాని, వేప నూనె గానీ పిచికారి చేసుకోవాలి. ఎసిఫేట్ 200 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 40 గ్రా. లేదా ట్రైజోఫాస్ 300 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 40 గ్రా. ఎకరాకు పిచికారి చేయాలి.

**ఆకుముడత/తలమాడు/మొవ్వు కుళ్ళు తెగులు :** ఈ తెగులు తామర పురుగుల ద్వారా ఒక మొక్క నుండి వేరొక మొక్కకు వ్యాప్తి చెందును. తెగులు ఆశించిన మొక్కల్లో ఆకుల అంచులు వెనుకకు ముడుచుకొని మెలికలు తిరిగి గిడసబారి రాలిపోతాయి. ఆకుల అడుగు భాగంలోని ఈనెలు రక్తపు వర్ణాన్ని పోలి ఉంటాయి. లేత దశలో వ్యాధి సోకినట్లయితే తలలు మాడి, మొక్కలు గిడసబారి ఎండిపోతాయి. ముదురు దశలో తెగులు పాక్షికంగా ఉండి అతి తక్కువ కాపు ఉంటుంది.

**నివారణ :** తెగులు వ్యాప్తి చెందటానికి కారణం అయిన తామర పురుగులను నివారించుకోవాలి. ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయాలి.

**సీతాఫలం తెగులు (బొబ్బెర తెగులు) :** ఈ వైరస్ తెగులు పేనుబంక ద్వారా పొడి వాతావరణం మరియు బెట్ట పరిస్థితులలో ఒక మొక్క నుండి వేరొక మొక్కకు వాప్తి చెందుతుంది. తెగులు సోకిన మొక్కలు లేత ఆకులు ముడతలుగా ఏర్పడి మందంగా పెద్దవిగా పెరుగుతాయి. మొక్కలు పూత పూయక వెర్రి తలలు వేస్తాయి. ఈ తెగులు విత్తనం ద్వారా కూడా వ్యాప్తి చెందును.

**నివారణ :** తెగులు సోకిన పంట నుండి విత్తనాలను సేకరించాలి. తెగులుకు కారణం అయిన పేనుబంకను నివారించుకోవాలి.


తెల్లదోమ


త్రుప్పు తెగులు



లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయాలి.

**సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు :** ఈ తెగులు సాధారణంగా పూత దశ నుండి ఆశిస్తుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు సోకిన ఆకులపై గుండ్రని చిన్న చిన్న మచ్చలు ఏర్పడతాయి. క్రమేపి ఈ మచ్చలు పెద్దగా మారి మధ్యలో బూడిద లేక తెల్లని రంగు చుక్కలు కలిగి ఉంటాయి. తీవ్రత ఎక్కువైనప్పుడు ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు కార్బండాజిమ్ 200 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 500 గ్రా. లేక థయోఫానేట్ మిథైల్ 200 గ్రా. ఎకరాకు పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

**కొరినోస్పోరా ఆకుమచ్చ తెగులు :** ఆకులపై చిన్న, చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో పెద్ద మచ్చలుగా మారి ఆకులు ఎండి రాలిపోతాయి.

నివారణ : మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**బూడిద తెగులు :** ఈ తెగులు విత్తిన 30-35 రోజుల్లో గాలిలో తేమ అధికంగా 80-85% ఉన్నప్పుడు వర్షాలు పడినప్పుడు ముదురు ఆకులపై, క్రింది భాగాలకు, కొమ్మలు మరియు కాయలకు బూడిద రూపంలో మచ్చలు వ్యాపిస్తాయి. ఈ తెగులు నివారణకు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫానేట్ మిథైల్ లేదా 0.5 గ్రా. మైక్లోబ్యుటానిల్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లేదా 1 మి.లీ. కెరాథేన్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ కలిపి 10-15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. మొక్కల సాంద్రత సరిపడా ఉండేటట్లు విత్తుకోవాలి. ఈ తెగులును తట్టుకునే టియం-96-2 అను రకాన్ని విత్తుకోవాలి.

**బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు :** తెగులు సోకిన మొక్కల ఆకులపై మొదట లేత గోధుమ రంగు ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడతాయి. క్రమేపి ఈ మచ్చలు ఆకు నిండా వ్యాపించి ఆకులు ఎండిపోతాయి. ముఖ్యంగా గాలిలో ఎక్కువ తేమ, వరుసగా వర్షం పడినప్పుడు తెగులు వ్యాప్తి చెందుతుంది. తీవ్ర స్థాయిలో లక్షణాలు కాయలపై కూడా కనిపిస్తాయి. తెగులు నివారణకు పది లీటర్ల నీటికి 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ + 2 గ్రా. ప్లాంటామైసిన్‌ను కలిపి అవసరాన్ని బట్టి 2 లేదా 3 సార్లు పిచికారి చేసుకోవాలి. యంజిజి-295 పెసర రకం ఈ తెగులును తట్టుకుంటుంది.

**త్రుప్పు లేదా కుంకుమ తెగులు :** ఆకు ఉపరితలంపైన లేత పసుపు వర్ణం గల గుండ్రని మచ్చలు ఏర్పడతాయి. తర్వాత కుంభాకృతితో కూడిన గుండ్రని మచ్చలు కుంకుమ రంగును పోలి ఉంటాయి. పైరు పూత దశలో ఉన్నప్పుడు ఈ తెగులు లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ : పంట మార్పిడి పాటించాలి. లీటరు నీటికి 3 గ్రా. మ్యాంకోజెబ్ + 1 మి.లీ. డైనోకాప్ లేదా 1 మి.లీ. ట్రైడిమార్ఫ్ లేదా 1 గ్రా. బైలాటాన్ కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9492396001**














# అపరాల పంటల కోత మరియు నిల్వలో తీసుకోవల్సిన ముందు జాగ్రత్తలు

డా॥ జి. వేణుగోపాల్, డా॥ కె. రుక్మిణిదేవి, ఎ. శ్రీరామ్, డా॥ ఎస్. శ్రీనివాసరావు మరియు కె. నాగ స్వాతి
వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఖమ్మం జిల్లా



సాధారణంగా అపరాల్లో వివిధ దశల్లో వివిధ రకాలుగా (చీడపీడలు, తెగుళ్ళు మరియు ఇతర కారకాల వలన) నష్టం జరుగుతుంది. అలాగే సుమారుగా 15 నుండి 25 శాతం వరకు కోత మరియు నిల్వలో నష్టం జరుగుతుందని వివిధ పరిశోధన ఫలితాలు తెలుపుతున్నాయి. కాబట్టి రైతు సోదరులు తప్పనిసరిగా కోత మరియు నిల్వలో తగు ముందు జాగ్రత్తలు తీసుకొన్నట్లైతే పైన తెల్పిన నష్టాన్ని చాలావరకు తగ్గించి, మంచి మార్కెట్ ధరలు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయి.



సాధారణంగా పూత దశ నుండి కంది 45-60 రోజులు, పెసర 30-40 రోజుల్లో మినుము 40-50 రోజుల్లో పక్వతకు చేరుతాయి. కాయలు మొదలుగా పసుపు రంగుకు మారి ఆ తర్వాత నలుపు రంగుకు మారతాయి. ఆకులు పసుపు వర్ణం దాల్చి నిధానంగా ఎండిపోతాయి. 80% కాయలు ఎండిన దశలో పంటలను కోసినచో అధిక నాణ్యత కల్గి ఉంటాయి.

పంటను మనుషుల ద్వారా కాయలు కోయుట (లేదా) కొడవలిని ఉపయోగించి మొక్కలు కోయుట (లేదా) కూలీల కొరత ఉన్న ప్రాంతాల్లో యంత్రాల ద్వారా కోయవచ్చును. అయితే యంత్ర సహాయంతో కోసేటప్పుడు ఆకులు పూర్తిగా ఎండిపోవాలి లేనిచో పెసర, మినుము పంటల్లో ఆకుల పసరు వలన గింజల నాణ్యత తగ్గే అవకాశం ఉంది. కావున దీనిని నివారించుటకు పంట పరిపక్వత దశలో కోతకు వారం రోజుల ముందు పారాక్వాట్ 4.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో ఆకులు ఎండి రాలిపోతాయి. తద్వార నాణ్యమైన గింజ లభిస్తుంది.



మనుషుల ద్వారా కోసిన పంటలను కాండం, ఆకులు ఎండే వరకు చిన్న చిన్న కుప్పలుగా వేసి 4-5 రోజులు ఎండిన తర్వాత నూర్పిడి కళ్ళాలపైగాని, టార్పాలిన్‌లపైన కర్రలతో కొట్టి (లేదా) ట్రాక్టర్‌తో తొక్కించి నూర్పిడి చేయాలి. నూర్పిడి చేసిన గింజలను బాగా శుభ్రపరిచి చెత్తాచెదారం, ఎండిన పుల్లలు, మట్టి బెడ్డలు, రాళ్ళు, తాలుగింజలు లేకుండా శుభ్రపరుచుకొని ఎండపెట్టుకోవాలి.

సాధారణంగా నూర్పిడి చేసినప్పుడు 13-14 శాతం వరకు తేమ కలిగి ఉంటుంది. ఈ స్థితిలో నిల్వ చేసినట్లయితే పెంకు పురుగులు, వివిధ రకాల శిలీంధ్రాలు ఆశించే ఆస్కారం ఎక్కువ కావున తప్పనిసరిగా శుభ్రపరచిన గింజల్లో 9-10 శాతం తేమ ఉండేలా చూసుకొని నిల్వ చేసుకోవాలి.

అపరాల నిల్వలో పెంకు పురుగులు అత్యధికంగా నష్టపరుస్తాయి. సాధారణంగా

కాయ పక్వ దశలోనే పంట పొలంలో పెంకుపురుగు అశించి గింజల ద్వారా నిల్వ చేసే గోదాములోకి ప్రవేశించి నష్టం కలుగజేస్తాయి. పెంకు పురుగు గింజలపై తెల్లని గ్రుడ్లని పెట్టి, ఈ గ్రుడ్ల నుండి వచ్చిన గోధుమ రంగు గ్రబ్స్ గింజ లోపల భాగాన్ని తిని రంధ్రాలు చేస్తాయి. ఇందులోనే గ్రబ్స్ కోశస్థ దశలోకి మారి అందులో నుండి పెంకు పురుగులు బయటకు వస్తాయి. కాబట్టి కోతకు వారం రోజుల ముందు పంటపై క్వినాల్ఫాస్ 25 ఇసి 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో నిల్వలో పెంకు పురుగులు ఆశించకుండా కాపాడవచ్చు. గృహ అవసరాలకు నిల్వ చేసుకున్నట్లైయితే 5 గ్రా. వేపపిండి లేదా 5 మి.లీ. వేప నూనె లేదా వంటనూనెను కిలో విత్తనానికి కలిపి నిల్వ చేస్తే పెంకు పురుగుల గ్రుడ్లు పొదగకుండా మరియు గ్రబ్స్ గింజలలోనికి పోకుండా చనిపోతాయి.



**మార్చి మాసంలో ప్రసారమయ్యే వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల రేడియో కార్యక్రమం- చేనుకబుర్లు**

పి.జె.టి.యస్.ఏ.యు వారి రేడియో కార్యక్రమం–చేను కబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్–ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.

| తేది | అంశం |
|---|---|
| 03.03.2021 | మిద్దెపై నుండి వచ్చే నీటి సంరక్షణ |
| | భారతీయ ఆదర్శ మహిళలు |
| 10.03.2021 | యాసంగి వరిని ఆశించే పురుగులు - సమగ్ర సస్యరక్షణ |
| | వినియోగదారుల హక్కులు |
| 17.03.2021 | మార్చి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు |
| | నీటి సంరక్షణ పద్ధతులు |
| 24.03.2021 | యాసంగి నువ్వుల సాగులో యాజమాన్య పద్ధతులు |
| | క్రొవ్వులో కరిగే విటమిన్లు - ఆరోగ్య ప్రయోజనాలు |
| 31.03.2021 | పచ్చిమేత కొరతకు వేసవిలో పశుగ్రాసాల సాగు |
| | ఆటిజం (Autism) |

గింజలను నిల్వ చేసే గోదాములు (లేదా) గదులు శుభ్రంగా ఉండేలా చూడాలి. అంతేకాక విత్తన నిల్వ చేసే గదుల్లో పగుళ్ళు, రంధ్రాలు పూడ్చి సున్నం వేయాలి లేదా గది గోడపైన క్రింద 20 మి.లీ. మలాథియాన్ ద్రావణం లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో దాగి ఉన్న పురుగులు/కీటకాలు చనిపోతాయి. నిల్వ చేసే బస్తాలను నేలపైన కాకుండా కొంచెం ఎత్తులో చెక్క బల్లపై పేర్చి గోడలకు తగలకుండా జాగ్రత్త పడాలి. సాధ్యమైనంత వరకు కొత్త సంచుల్లో విత్తనాన్ని నిల్వ చేయాలి. పాత సంచులు నిల్వకు ఉపయోగించవలసివస్తే వాడే ముందు 100 మి.లీ. వేప ద్రావణం లేదా 50 మి.లీ. వేప గింజల కషాయం లేదా 10 మి.లీ. మలాథియాన్ లేదా 2 మి.లీ. డెల్టామెత్రిన్ లీటరు నీటికి కలిపి సంచులపై పిచికారి చేసి ఆరబెట్టుకొని వాడాలి.

గింజలను నిల్వచేసేటప్పుడు వాటిలోని తేమను ఎప్పటికప్పుడు గమనించుకుంటూ మధ్య మధ్యలో ఆరబెట్టుకుంటూ నిల్వ చేసినట్లైయితే పైన తెలిపిన కీటకాలు, శిలింధ్రాల నష్టాన్ని చాలావరకు తగ్గించవచ్చు.

పైవిధంగా తగు జాగ్రత్తలు పాటించినట్లయితే గింజ నాణ్యంగా ఉండి మార్కెట్‌లో మంచి ధరను రైతు సోదరులు పొందే అవకాశాలున్నాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 7207396961




# వేరుశనగ పంట కోతలో మెళకువలు

డా॥ జి. శేషు, కె. మమత, కె. స్రవంతి, జి. మాధురి, డా॥ వి. దివ్యరాణి, డా॥ ఒ. శైల, డా॥ ఎం. సుజాత మరియు డా॥ సిహెచ్. దామోదర్ రాజు
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

వేరుశనగలో పంటకోత అనేది శ్రమతో కూడిన మరియు ఖర్చుతో కూడిన పని. పంటకోత నేల యొక్క తేమ మరియు అనుకూల పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. వేరుశనగ మొక్క నిశ్చితమైన పెరుగుదలను కలిగి ఉండదు. పుష్పించే సమయం స్పానిష్ బంచ్ రకాలలో 2 నెలల వరకు, వర్జీనియా-రన్నర్ రకాలలో 3 నెలలకు పైగా ఉంటుంది. పువ్వు ప్రారంభ దశ నుండి కాయలు పూర్తి పరిపక్వత చెందడానికి 60 రోజుల సమయం పడుతుంది. ఈ కారణం చేత పంటలో వివిధ దశల్లో కొన్ని లేతకాయలను, మరికొన్ని పరిపక్వ కాయలను గుర్తించడం జరుగుతుంది. కాయలలో మంచి నాణ్యమైన, పరిపక్వత చెందిన కాయలను గుర్తించి పంటకోత సమయాన్ని అంచనా వేయడం పైన తెలిపిన కారణం వల్ల సరైన కోత సమయాన్ని నిర్ణయించడం కష్టం.

పంట పరిపక్వతను అంచనా వేయడంలో తప్పు జరిగి కోత ముందే చేస్తే పెద్ద సంఖ్యలో ఏర్పడిన లేత కాయలను వాటి అభివృద్ధి జరగక ముందే కోయడం వలన దిగుబడిలో నష్టం వచ్చే అవకాశం ఉంది. ఒక వేళ పంటకోత ఆలస్యం చేస్తే ముందే ఏర్పడిన కాయలు మొక్క నుండి విడిపోయి మట్టిలోనే ఉండిపోవచ్చు. ఈ సమయంలో వర్షం పడినా, భూమిలో తేమ ఎక్కువగా ఉన్నా ముందే ఏర్పడిన కాయలు మొలకెత్తడానికి అవకాశం ఉంటుంది. కోత సమయంలో వర్షం పడితే ఆకుల నాణ్యత లోపించి పశువుల మేతగా ఉపయోగించడానికి కూడా కష్టం అవుతుంది. అందుచేత అధిక నాణ్యత గల కాయలు మరియు గింజల శాతం, గింజలో నూనె శాతం అధికంగా ఉన్న సమయాన్ని గుర్తించి పంటకోత చేయడం చాలా ముఖ్య భూమిక పోషిస్తుంది.

కాయలు బాగా అభివృద్ధి చెంది మొక్క పసుపు రంగులోకి మారుతుంది. మొక్కలో ఆకులు రాలడం కూడా ప్రారంభం అవుతుంది. కాయలలో గింజలు పూర్తిగా అభివృద్ధి చెందడం, కాయలపై చారలు స్పష్టంగా కనబడటం, పొట్టు లోపల భాగం నల్లగా మారడం, గింజలు వాటి ప్రత్యేక లక్షణాలకు అనుగుణంగా పై పొట్టు రంగును ఏర్పరుచుకోవడం, ఇలా జన్యుపరంగా అన్ని లక్షణాలు పూర్తిగా అభివృద్ధి చెందాక పంట కోతను ప్రారంభించడం సరైన యాజమాన్య పద్ధతి.

సరైన కోత సమయాన్ని నిర్ణయించడానికి పంటలో అక్కడక్కడ కొన్ని మొక్కలను బయటకు తీసి పరిశీలించడం ద్వారా తెలుసుకోవచ్చు. నిర్దిష్టమైన లక్షణాలను గమనించి పంట పరిపక్వత సమయం ఆసన్నమైనప్పుడు



ఇలా చేయాలి. అధిక శాతం కాయలు అంటే దాదాపు 75% అంతకంటే ఎక్కువ పరిపక్వత చెందినపుడు పంట కోత ప్రారంభించాలి.

**పంటకోత, కాయలను తొలగించడం:** వాతావరణ సూచనలకు అనుగుణంగా మంచి ఎండ ఉన్న రోజుల్లో పంటను కోయడం (లాగడం, పీకడం) ద్వారా కాయలపై గీతలు బాగా అభివృద్ధి చెందుతాయి. కాయలపై ఉన్న పొట్టు ప్రకాశవంతంగా ఉన్నట్లయితే ఆ కాయలు మంచి నాణ్యతను సంతరించు కుంటాయి.

పంటకోత మనుషులు ద్వారా, ఎద్దుల పళ్ళ నాగలి ద్వారా లేదా ట్రాక్టర్ డిగ్గర్ ద్వారా చేయవచ్చు. మొక్కల నుండి కాయలను వేరు చేయడం మనుషుల ద్వారా లేదా యాంత్రిక పద్ధతిలో వేరుశనగ నూర్పిడి యంత్రాలతో చేస్తారు. నేలలో తేమ శాతం 8-15% ఉన్నప్పుడు పంటకోతకు వేరుశనగ హార్వెస్టర్‌ను ఉపయోగిస్తారు. దీని నిర్వహణకు ఒక హెక్టారుకు 660/- రూపాయల ఖర్చు అవుతుంది.

సాధారణంగా మొక్కలను నేలనుండి బయటికి తీసి వేరు చేసిన తర్వాత మొక్కలను తలక్రిందులుగా (కాయలు పైకి ఉండే విధంగా) అమర్చి కుప్పలుగా పేరుస్తారు. కాయలకు ఉన్న ఊడలు ఒక వారంలో పూర్తిగా ఎండిన తర్వాత కాయలను చేతితో తీసివేస్తారు. కొన్ని ప్రాంతాలలో అదే రోజు పచ్చికాయలను ఒలవడం కూడా చేస్తారు. పచ్చి కాయలను మొక్కల నుండి వేరు చేయడానికి వేరుశనగ నూర్పిడి యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాలు గుత్తిరకాలకు బాగా ఉపయోగ పడతాయి.

పవర్ టిల్లర్ ద్వారా నడిచే నూర్పిడి యంత్రాలు గంటకు 10-12 అశ్వశక్తిని కలిగి ఉండి అన్నిరకాల ఎండిన మరియు పచ్చి కాయలను తొలగించడానికి అనువుగా ఉండి సమయాన్ని మరియు శ్రమను ఆదా చేస్తాయి. ఈ యంత్రాలు దాదాపు 7,000-10,000/- ధరలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

**వేరుశనగ నూర్పిడి యంత్రం:** వేరుశనగ మొక్కలనుండి కాయలను వేరు చేయడానికి ఒక హెక్టారుకు 175-200 గంటల వ్యవసాయ కూలీలు (మహిళలు) అవసరం. అధిక విస్తీర్ణంలో పంటను సాగు చేసినప్పుడు కూలీల కొరతతో పాటు అధికంగా కూలీల వేతనం ఇవ్వవలసివస్తుంది. దీనిని నియంత్రించడానికి యాంత్రిక పద్ధతులను అవలంభించడం ఎంతో అవసరం. పచ్చికాయలను వేరు చేసే పవర్ ఆపరేటెడ్ త్రీ-ఇన్ రకం వేరుశనగ యంత్రం సాగుదారులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.

| | | |
|---|---|---|
| యంత్ర సామర్థ్యం | - | గంటకు 150 కిలోల కాయలు |
| వ్యవసాయ కూలీల అవసరం | - | ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు |
| ఖర్చులు ఆదా | - | 30% |
| సమయం ఆదా | - | 70% |
| పరికరాల ఖర్చు | - | హె॥ 30,000/- |

**కిరోసిన్ ద్వారా నడిచే వేరుశనగ నూర్పిడి యంత్రం :** ఊడల నుండి వేరుశనగ కాయలను వేరు చేయడానికి 2.5 హెచ్.పి. కిరోసిన్ ఇంజన్ ద్వారా నడిచే ఈ యంత్రం ఖరీదు రూ॥ 20,000/-. దీని నిర్వహణకు ఇద్దరు కూలీలు సరిపోతారు. ఈ యంత్రం ద్వారా నాణ్యమైన కాయలను అంటే ఊడలు లేని కాయలను పొందవచ్చు.





# మెట్ట వ్యవసాయంలో సవాళ్ళు మరియు వేసవి లోతుదుక్కుల ప్రాధాన్యత

డా॥ కె. ఇందుధర్ రెడ్డి, డా॥ జి. శ్రీనివాస్, డా॥ బి. బాలాజీ నాయక్, డా॥ డి. దేవ్ కుమార్ మరియు డా॥ టి. లోక్య
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం
వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

మన రాష్ట్రంలో సుమారుగా 50 శాతం సాగుభూమి వర్షాధారంగా సాగవుతోంది. వర్షాధార మెట్ట వ్యవసాయంలో వాతావరణ అవరోధాలు, భూసారం, కలుపు సమస్యలు, ఆర్థిక అవరోధాలు మరియు సాంప్రదాయ పద్ధతిలో సాగు వంటి అవరోధాలు పంట దిగుబడిని దెబ్బతీస్తున్నాయి.

అధిక లేదా అల్ప వర్షపాతం, పంటకాలంలో సుదీర్ఘ బెట్ట పరిస్థితులు,నేలలో తక్కువ సేంద్రియ పదార్థాలు, తక్కువ నీటి నిల్వ శక్తి, తక్కువ భూసారం, నేల కోత, నేలలోని నీరు ఇంకని పొరలు, అధిక కలుపు సమస్యలు మరియు మెట్ట వ్యవసాయంలో రైతులు ఆర్థికంగా వెనకబాటు వలన పెట్టుబడి పెట్టలేకపోవటం వంటి సమస్యలు పంట సాగుకు మరియు అధిక పంట దిగుబడికి అవరోధాలుగా వున్నాయి. ఇటువంటి అవరోధాలను అధిగమించే విధంగా వ్యవసాయంలో మార్పులు చేసుకుని మెట్ట వ్యవసాయంలో వాతావరణ స్థితిస్థాపకత చేకూర్చుకుని స్థిరమైన పంట దిగుబడులు పొందడం కోసం వేసవి లోతుదుక్కులు చేసుకోవడం తప్పనిసరి.

జూన్ నెల తొలకరి (వర్షాకాలం) కంటే ముందుగా వేసవిలో నేలను లోతుగా దున్నుకోవడాన్ని వేసవి లోతుదుక్కులు అంటారు. యాసంగిలో పంట కోసిన వెంటనే అనగా మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో నేలలో కొద్దిగా తేమ ఉన్నప్పుడు లోతుదుక్కులు చేసుకోవచ్చు. ఉదాహరణకు యాసంగిలో వేరుశనగ పంట కోసిన వెంటనే లోతుదుక్కులు చేసుకోవచ్చు. ఏప్రిల్ లేదా మే నెలల్లో కురిసిన వర్షానికి లోతుదుక్కులు చేసుకోవచ్చు. గత 30 సంవత్సరాల వర్షపాత గణాంకాలను పరిశీలించినట్లయితే ఏప్రిల్ నెలలో సగటున 30 మి. మీ మరియు మే నెలలో సగటున 40 మి. మీ వర్షపాతం నమోదయ్యింది. కావున ఆ వర్షానికి కూడా లోతు దుక్కులు చేసుకోవచ్చు. కానీ అంతకు ముందు దుక్కులు చేసుకున్నట్లయితే, మే నెలలో కురిసిన వర్షపు నీటిని కూడా సమర్థవంతంగా సంరక్షించుకోవచ్చు.

ట్రాక్టర్ తో ఉపయోగించే ప్రత్యేకమైన పనిముట్లయిన మౌల్డ్ బోర్డు ప్లవ్ మరియు డిస్క్ ప్లవ్ లను ఉపయోగించి నేలను వాలుకు అడ్డంగా కనీసం 30 సెం.మీ. లోతుగా దున్నుకోవాలి . తొలకరి వర్షాలకు ముందే కనీసం రెండు సార్లు నేలను దున్నినట్లైతే వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలు సమర్థవంతంగా వినియోగించుకొని వర్షాకాలపు పంటలో ప్రస్ఫుటమైన ఫలితాలను గమనించవచ్చు.

**వేసవిలో లోతుదుక్కుల వలన లాభాలు:** లోతు దుక్కుల వల్ల నేలలోని నీరు ఇంకని పొరలు తొలగిపోయి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. దీనివల్ల కురిసిన వర్షపు నీరు అక్కడికక్కడే నేలలోకి ఇంకి నీరు పరిరక్షించబడి భూగర్భజలాలు పెరుగుతాయి. దీనివల్ల నీటిని పరిరక్షించడమే కాకుండా నేల కోతను ఆపి నేలను, భూసారాన్ని కూడా సంరక్షిస్తుంది. వేసవిలో పగలు వేడి తాపానికి, రాత్రి చల్లదనానికి నేల గుల్లగా తయారవడం వల్ల నేల యొక్క ఆకృతి వృద్ధి చెందుతుంది. దీనివల్ల పంటకాలంలో మొక్కల వేర్లు నేల లోపలి పొరలలోకి వెళతాయి. అంతేకాకుండా నేలలోని గాలి శాతం పెరిగి సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెంది పంట యొక్క సేంద్రియ వ్యర్థాలు పూర్తిగా మరియు తొందరగా కుళ్ళిపోయి భూసారం పెరుగుతుంది. వర్షాధార పంటలలో తక్కువ వర్షపాతం నమోదు అయినప్పుడు, పంట యొక్క వేర్లు లోతుగా ఉండటం వలన నేల లోపలి పొరలలోని తేమను వినియోగించుకొని బెట్టను తట్టుకునే శక్తి చేకూరుతుంది. వేసవిలో దున్నటం వల్ల నేల పొరలలో ఉన్నటువంటి క్రిములు, పురుగుల యొక్క కోశస్థ దశలు బహిర్గతం అవ్వడంతో ఎండ వేడికి చనిపోతాయి మరియు కలుపు విత్తనాలు కూడా వేడికి నశించిపోతాయి. దీనివల్ల ఆ తరువాతి పంటకాలంలో కలుపు మందులకు, క్రిమిసంహారక మందులకు పెట్టుబడి తగ్గిపోతుంది. వేసవిలో లోతుదుక్కులు చేసుకోవడం వల్ల జూన్ నెలలో తొలకరి వర్షాలు మొదలైన వెంటనే పంట విత్తుకోవడం సులభమవుతుంది. వర్షాధారిత మెట్ట వ్యవసాయంలో రైతులు ఈ లాభాలు పొందడానికి వేసవిలో లోతుదుక్కులు చేసుకోవటం తప్పనిసరి. కనుక వేసవిలో లోతుదుక్కులు చేసుకుని మంచి ఫలితాలు పొందుతారని ఆశిస్తున్నాము.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 8328302074





# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా|| ఆర్. విజయ కుమారి

వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2020-21 సంవత్సరం యాసంగిలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏవిధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది.

ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 18 సంవత్సరాల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగినది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2020-21 యాసంగి కోత సమయంలో ధర ఏవిధంగా ఉండునో అంచనా వేయడం జరిగినది. దానిని అనుసరించి:

| క్ర.సం. | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి.) |
|---|---|---|---|---|
| 1. | వరి (సాధారణం) | సూర్యాపేట | మార్చి-మే | 1650-1868 |
| 2. | వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | మార్చి-మే | 1888-2300 |

**గమనిక :** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 18 సంవత్సరాల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtsau.edu.in/agri-marketing-intelligence.html






# 2021-22 జాతీయ వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగ ప్రాముఖ్యత



డా॥ కె. వాణిశ్రీ, డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి, డా॥ యస్. ఉపేందర్
మరియు డా॥ యం. విజయలక్ష్మి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ 2021-22ను కేంద్ర ఆర్థిక మంత్రి గౌ॥ శ్రీమతి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1, 2021న ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ముఖ్యాంశాలుగా స్టార్టప్‌లు, ఎం.ఎస్.ఎం.ఈలు, పరిశోధన మరియు ఆవిష్కరణలపై దృష్టి సారించారు. దేశీయ సంస్థలను ప్రోత్సహించటం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ (భారత దేశ స్వావలంబన) వైపు అడుగులు వేస్తూ వాటాదారులలో సామర్థ్యం, సాంకేతికత మరియు నాణ్యతను పెంచే దిశగా చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర బడ్జెట్ 2021-22 యొక్క స్థూల దృష్టి ఆత్మనిర్భర్ భారత్ యొక్క లక్ష్యాన్ని పెంచడం ద్వారా మరియు వివిధ రంగాలలో ప్రపంచ ఉత్పాదక కేంద్రంగా భారతదేశ సామర్థ్యాన్ని విస్తరించడం. 2021-22 కేంద్ర బడ్జెట్ ఆరు స్థంభాలపై ఆధారపడి ఉందని ఆర్థిక మంత్రి తెల్పారు.

1. ఆరోగ్యం మరియు శ్రేయస్సు
2. భౌతిక మరియు మూలధన మౌళిక సదుపాయాలు
3. భారతదేశ సమగ్ర అభివృద్ధి
4. మానవ మూలధనాన్ని తిరిగి పెంచే ప్రయత్నం
5. ఇన్నోవేషన్ మరియు పరిశోధన
6. కనీస ప్రభుత్వం మరియు గరిష్ట పాలన

కోవిడ్-19 మహమ్మారి తర్వాత జరుగుతున్న భౌగోళిక రాజకీయ మరియు ఆర్థిక మార్పులను ఉపయోగించుకోవటానికి భారతదేశం సన్నద్ధంగా ఉందని ఆర్థిక మంత్రి నొక్కి చెప్పారు. పాలనలో సామర్థ్యాన్ని పెంచటానికి, సేవలు, ఉత్పత్తులు మరియు నాణ్యతను పెంచటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని ప్రభుత్వం భావిస్తుంది. కేంద్ర బడ్జెట్ 2021-22లో రూ॥ 1,31,531 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించటం ద్వారా వ్యవసాయ రంగంపై ప్రభుత్వ ప్రాధాన్యతను వివరించారు. వ్యవసాయ సెస్‌ను ప్రవేశపెట్టి, కనీస మద్దతు ధర యొక్క ప్రాముఖ్యతపై దృష్టి సారించినట్లైంది. వ్యవసాయ రంగం 2016 నుండి ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని ఆర్థిక మంత్రి విశదీకరించారు. వ్యవసాయ మరియు వ్యవసాయానుబంధ రంగాలకు దోహదపడే తొమ్మిది చర్యలను ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.

**ది సర్వే ఆఫ్ విలేజస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వామిత్వ) పథకాన్ని అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరించడం :** ఆరు రాష్ట్రాల కోసం 2020 అక్టోబర్‌లో ప్రవేశపెట్టిన “ది సర్వే ఆఫ్ విలేజస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్” (స్వామిత్వ) పథకం ఇప్పుడు జాతీయ పథకంగా అమలు చేయబడుతుంది. ఋణాలు మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాలను తీసుకోవటానికి గ్రామస్తులు తమ ఆస్తిని ఆర్థిక ఆస్తిగా ఉపయోగించుకోవటానికి ఈ పథకం ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు 1241 గ్రామాల్లో 1.80 లక్షల మంది ఆస్తి యజమానులకు కార్డులు అందించినట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

**వ్యవసాయ ఋణ లక్ష్యాన్ని పెంచటం :** 2021-22 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ ఋణ లక్ష్యాన్ని 16.5 లక్షల కోట్లకు పెంచారు. అంతేకాకుండా పశుసంవర్ధక, పాడి, మత్స్య సంపదకు పెరిగిన ఋణ ప్రవాహాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఆర్థిక మంత్రి హామి ఇచ్చారు.








**గ్రామీణ మౌళిక సదుపాయాల అభివృద్ధి నిధిని 33% పెంచటం :** గ్రామీణ మౌళిక సదుపాయాల అభివృద్ధి నిధికి రూ. 30,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్లకు పెంచినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు

**మైక్రో ఇరిగేషన్ నిధిని రెట్టింపు చెయ్యటం :** మైక్రో ఇరిగేషన్ నిధిని రెట్టింపు చేయాలని దీనికోసం నాబార్డ్ కింద 5 వేల కోట్ల కార్పస్‌తో ప్రారంభించి మరో 5 వేల కోట్ల వృద్ధిని సాధించాలని నిర్దేశించారు.



**ఆపరేషన్ గ్రీన్ స్కీమ్ :** వ్యవసాయ మరియు వ్యవసాయానుబంధ ఉత్పత్తులు మరియు వాటి ఎగుమతుల్లో విలువ పెరుగుదలను పెంచడానికి టమాటాలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు (టాప్స్) లకు ప్రస్తుతం వర్తించే ఆపరేషన్ గ్రీన్ స్కీమ్ పరిధి పెంచి మరో 22 పాడైపోయే ఉత్పత్తులను చేర్చడానికి అనుమతినిచ్చారు.

**1000 మార్కెట్‌లను ఈ-నామ్‌తో అనుసంధానించటం :** సుమారు 1.68 కోట్ల రైతుల సభ్యత్వం మరియు 1.14 లక్షల కోట్ల వాణిజ్య లావాదేవీలు ఈ-నామ్‌ల ద్వారా జరిగాయని ఆర్థిక మంత్రి తెల్పారు. వ్యవసాయ మార్కెట్లో ఈ-నామ్ తెచ్చిన పారదర్శకత మరియు పోటీతత్వాన్ని దృష్టిలో ఉంచుకొని మరో 1000 వ్యవసాయ మార్కెట్లు ఈ-నామ్‌తో అనుసంధించాలని ప్రతిపాదించారు.



**ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ కమిటీలు వ్యవసాయ మౌళిక సదుపాయాల నిధిని ప్రవేశపెట్టటం :** ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ కమిటీలు వారి మౌళిక సదుపాయల కల్పన కోసం వ్యవసాయ మౌళిక సదుపాయాల నిధిని అందుబాటులో ఉంచాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.

**ఐదు ప్రధాన ఫిషింగ్ నౌకాశ్రయాలను అభివృద్ధి చేయటం:** ఆధునిక ఫిషింగ్ నౌకాశ్రయాలు మరియు చేపల ల్యాండింగ్ కేంద్రాల అభివృద్ధికి గణనీయమైన పెట్టుబడులను ప్రతిపాదించారు. కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, పారాదీప్ మరియు పెటుఘాట్ వంటి ఐదు ప్రధాన ఫిషింగ్ నౌకాశ్రయాలను ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు మరియు జల మార్గాల ఒడ్డున లోతట్టు ఫిషింగ్ నౌకాశ్రయాలు మరియు చేపల ల్యాండింగ్ కేంద్రాలను అభివృద్ధి చేయాలని సీతారామన్ ప్రతిపాదించారు.





**మల్టీపర్పస్ సీ వీడ్ పార్క్ తమిళనాడులో స్థాపించబడుతుంది:** సీ వీడ్ పెంపకంలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించటం, తీర ప్రాంత సమాజాల జీవితాలను మార్చే సామర్థ్యం గల అభివృద్ధి చెందుతున్న రంగం అని ఆర్థిక మంత్రి చెప్పారు. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి మరియు అదనపు ఆదాయాలను అందిస్తుంది. సీ వీడ్ సాగును ప్రోత్సహించడానికి తమిళనాడులో ఒక బహుళార్థ సాధక సీవీడ్ పార్కును ఏర్పాటు చేయాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.





ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను వివరిస్తూ వ్యవసాయ వస్తువుల ఉత్పత్తి ఖర్చు కంటే కనీసం 1.5 రెట్లు ఎక్కువ ధరను భరోసా ఇవ్వడానికి కనీస మద్దతు ధర పాలన మార్పుకు సరైందని, కనీస మద్దతు ధర మార్పు అంశంలో రైతులు వివాదాస్పదంగా ఉన్నప్పటికీ వరి, గోధుమలు, పప్పుధాన్యాలు, ప్రత్తి వంటి పంటల సేకరణ 2016 నుండి అనేక రెట్లు పెరిగిందని మొత్తం రూ॥ 43.36 లక్షల మంది ఈ చెల్లింపుల వల్ల లబ్ధి పొందారని, తమ ప్రభుత్వం రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కృతనిశ్చయంతో పనిచేస్తుందని, 2021-22 వార్షిక బడ్జెట్ వ్యవసాయ రంగ బలోపేతానికి కృషి చేస్తుందని ఆకాంక్షించారు.





# సేంద్రీయ ఎరువుగా చెఱకు చెత్త

డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, కె. రామకృష్ణ, యమ్. రాజశేఖర్, ఆదిశంకర్, యల్. శ్రావిక,
బి. రాజశేఖర్ మరియు అఫీఫా జహాన్
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

చెఱకు పంటను నరికిన తర్వాత మిగిలిపోయిన పంట వ్యర్థాలైన చెత్త, మోడు మరియు ఇతర వ్యర్థాలను తగలబెట్టడం రైతులకు అలవాటుగా మారిపోయింది. చెఱకు చెత్తను తగలబెట్టడం వలన పొలంలో చేరిన కీటకాలను మరియు వ్యాధి కారక జీవులను నశింప చేయవచ్చని రైతులు అనుకుంటారు. కానీ పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన పర్యావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా టన్ను పంట వ్యర్థాలను మండిస్తే 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు దాదాపు 1400 కిలోల కార్బన్‌డైయాక్సైడ్ గాలిలోకి విడుదల అవుతుంది. వీటితో పాటు మూడు కిలోల సూక్ష్మధూళికణాలు, బూడిద, సల్ఫర్‌డైయాక్సైడ్ గాలిలో కలుస్తున్నాయి. చెఱకు పంట వ్యర్థాలను కాల్చడం వలన కాలుష్యం పెరగడంతో పాటు భూసారం సైతం క్షీణిస్తుంది. సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుంది. నేల పొరల్లో తేమశాతం ఆవిరై దిగుబడులపై ప్రభావం చూపుతుంది. వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడానికి కారణమవుతున్న పంట వ్యర్థాలను తగలబెట్టడానికి బదులుగా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలి.

సాధారణంగా ఒక ఎకరా చెఱకు నరికిన తర్వాత 4 టన్నుల చెఱకు చెత్త, ఆకులు, మోడులు మిగిలిన మొదళ్ళ రూపంలో తోటలో వ్యర్థాలుగా మిగిలిపోతాయి. ఈ విధంగా మిగిలిన చెత్తను సాళ్ళ మధ్యలో పరిచి కుళ్ళించి సేంద్రీయ ఎరువుగా మార్చి చెఱకు సాగులో ఉపయోగించడం వలన నేల భౌతిక స్వభావం మెరుగుపడి, భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండడమే కాకుండా పీక పురుగు ఉధృతి తగ్గుతుంది. మొక్క తోటలో చెఱకు నాటిన మూడవ రోజున చెఱకు చెత్తను పరిచి వర్షాలు పడిన తర్వాత ఎకరాకు 8 కిలోల యూరియా, 20 కిలోల సూపర్‌ఫాస్పేట్ వేస్తే తొందరగా కుళ్ళి సేంద్రీయ ఎరువుగా తయారవుతుంది.

చెఱకు చెత్తను కప్పడం వలన మోడెం పంట భూమిలో తేమ 16 శాతం వరకు పెరుగుతుందని, కలుపు 60 శాతం వరకు నివారింపబడుతుందని, పీక పురుగు ఉధృతి 27 శాతం వరకు తగ్గుతుందని మరియు దిగుబడులు 20 శాతం పెరుగుతాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

ప్రతి టన్ను చెఱకు పంట చెత్త, మోడులు పెరగడానికి భూమి నుండి 2.4 కిలోల నత్రజని, 0.5 కిలోల భాస్వరం, 3.5 కిలోల పొటాషియం మరియు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలను కూడా తీసుకుంటుంది. అందువలన ఈ చెత్తను భూమిలో కలియదున్నితే లేదా సాళ్ళ మధ్య పరచడం వలన ఈ పోషకాలన్నీ తిరిగి నేలకు చేరతాయి లేదా ఈ వ్యర్థాలను ముడి పదార్థాలుగా వాడకుని కంపోస్టు పద్ధతి ద్వారా సేంద్రీయ ఎరువుగా వాడటం వలన సిఫారసు చేయబడిన రసాయన ఎరువులను 25 శాతం వరకు తగ్గించుకొనే అవకాశం ఉంటుంది.

**చెఱకు చెత్తను ముక్కలు చేయు పరికరం :** ట్రాక్టర్‌తో పనిచేయు ట్రాష్ ష్రెడ్డర్ అనే పరికరం చెఱకు చెత్తను 2 నుండి 6 అంగుళాల సైజులో చిన్న చిన్న ముక్కలుగా నరికి పొలంలో సమానంగా కప్పి వేస్తుంది ఈ విధంగా చేయడం వలన చెఱకు చెత్త త్వరగా కుళ్ళి సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పరికరంతో ఒక ఎకరా పొలంలో చెత్తను ముక్కలుగా కోసి కప్పుటకు గంట సమయం పడుతుంది. ఈ విధంగా చెఱకు చెత్తను సేంద్రీయ ఎరువుగా వాడటం వలన సిఫారసు చేయబడిన రసాయన ఎరువులను 25 శాతం వరకు తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

భూమి వేడెక్కడానికి ప్రధాన కారణం అయిన కార్బన్‌డైయాక్సైడ్ సాంద్రత తగ్గించాలన్న మరియు నేలలో సేంద్రీయ కర్బన శాతం పెరగాలన్న పంట వ్యర్థాలను తిరిగి నేలకే చేర్చడం చాలా ఉత్తమమైన పద్ధతి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9848774820

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ కె. వాణిశ్రీ




**అడ్డం**

1. మొబైల్ ఆధారిత ఈ-ప్రసార సేవలలో భాగంగా వ్యవసాయ మరియు వ్యవసాయానుబంధ రంగాల సాగు సమస్యలపై నేరుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల నుండి సలహాలు పొందుటకు ఏర్పాటు చేసిన కార్యక్రమం? (11)
2. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు నుండి ఉత్పత్తి చేస్తున్న వంట నూనె? (4)
3. తేనెటీగల పెంపకంలోని ఒక ఉపఉత్పత్తి పేరు? (2)
4. మిరపలో తామర పురుగులు, నల్లి నివారణకు రైతులు విరివిగా వాడే రసాయనం? (4)
5. కాలీఫ్లవర్‌లో బోరాన్ లోపం వలన పువ్వుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడటాన్ని ఏమంటారు? (3)

**నిలువు**

1. మానవాళికి అన్నం పెట్టే ఉద్దేశ్యంతో నిర్విరామంగా కృషి చేసే రైతుకు మరో పేరు? (4)
2. వరిలో అగ్గితెగులు నివారణకు విరివిగా వాడే శిలీంధ్రనాశిని? (6)
3. వానాకాలంలో పండే ఆఫ్ సీజన్ మామిడిని ఏమంటారు? (3)
4. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల నుండి ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేయబడుతున్న వంట నూనె? (5)
5. రైతాంగం కోసం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ప్రచురితమయ్యే తెలుగు మాస పత్రిక? (4)
6. క్రికెట్ బాల్ అనే రకం ఏ పండు రకం? (3)
7. కాలీఫ్లవర్‌లో నత్రజని లోపం వల్ల చిన్న చిన్న పూలు ఏర్పడటాన్ని ఏమంటారు? (4)

సమాధానాలు 34వ పేజీలో



# భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం మరియు మట్టి నమూనా సేకరణ పద్ధతులు

డా॥ జి. కిరణ్ రెడ్డి, డా॥ యం. వెంకట రమణ, డా॥ ప్రగతి కుమారి, డా॥ యం.డి. ఆలీ బాబా,
డా॥ కె. చిరంజీవి మరియు యం. సంతోష్ కుమార్
సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగము, రాజేంద్రనగర్, హైదరాబాద్

రసాయనిక ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చు అని రైతులకు తెలుసు. రసాయనిక ఎరువులు వాడకానికి కూడా రైతులు అలవాటు పడ్డారు. అధిక దిగుబడులు సాధించడానికి రసాయనిక ఎరువుల మోతాదులు వివిధ పంటలకు సరియైన పాళ్ళలో వాడటం ఎంతైనా అవసరం. అయితే కొందరు రైతులు అవసరమైన దానికన్నా ఎక్కువగాను, మరికొందరు తక్కువగాను వాడుతున్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడితే పెట్టుబడి ఎక్కువై నికరాదాయం తగ్గుతుంది. తక్కువగా వాడితే అసలు దిగుబడులు తగ్గిపోతాయి. కావున రైతులు అధిక దిగుబడులు పొందాలంటే రసాయనిక ఎరువులను భూసార పరీక్షను బట్టి మాత్రమే వాడాలి. భూసార పరీక్ష చేయకుండా వేయడం అంటే డాక్టరు పరీక్ష చేయించుకోకుండానే మందులు తీసుకోవడం అన్నమాట. అందువలన రైతులు పంటలు వేసే ముందు తమతమ పొలాల భూసార విలువలు తెలుసుకొని, తద్వారా తాము వేయదలచిన పంటలకు తగిన మోతాదులలో రసాయనిక ఎరువుల సిఫారసులు పొంది, ఎరువులను ఒక క్రమ పద్ధతిలో, సరియైన సమయంలో వేసినచో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందవచ్చు.

భూసార పరీక్షా ఫలితాలు మనం సేకరించే నమూనాపై ఆధారపడి ఉంటాయి, కాబట్టి రైతులు నమూనా సేకరించడంలో మెళకువలు చూపించవలసి ఉంటుంది.

**మట్టి నమూనల సేకరణ:** నమునాలు సేకరించాల్సిన పొలాన్ని భాగాలుగా విడగొట్టాలి. నేల రంగు మార్పును బట్టి, రకాన్ని బట్టి, రైతు తన అనుభవంతో పంట దిగుబడులలో గమనించిన తేడాలను బట్టి వేర్వేరుగా మట్టి నమూనాలను తీయాలి. మార్పులు లేకుండా పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు 5 ఎకరాలు (2 హెక్టార్లు) విస్తీర్ణానికి ఒక మట్టి నమూనా తీస్తే సరిపోతుంది. ఒకే రకం లక్షణాలు గల భూమిని ఒక భాగంగా ఎన్నుకోవాలి. మట్టి నమూనా తీసుకోవడానికి నిర్ణయించిన పొలంలో 8-10 చోట్ల మట్టిని సేకరించాలి. ఒక చోటునుండి మట్టిని తీయునపుడు అక్కడ ఉన్న చెత్త, చెదారం తీసివేసి, నాగలి లోతు వరకు అంటే 6 అంగుళాలు లేదా 15 సెంటీమీటర్ల వరకు పైనుంచి అన్ని పొరల నుండి మట్టి గీకి తీయాలి. పండ్ల తోటలకు అయితే ప్రతి అడుగు లోతుకు ఒకటి చొప్పున 5 అడుగులకు 5 నమునాలు తీయాలి. మట్టి నమూనాలు తీయడానికి కుర్పి, ఆగరు వంటి సాధనాలు ఉపయోగించాలి. అవి లేనిచోట్ల రైతులకు అందుబాటులో ఉన్న పార, గడ్డపార కూడా ఉపయోగించవచ్చు. ఇలా 8-10 చోట్ల నుండి తీసిన మట్టి సుమారు 5-7 కిలోల వరకు ఉంటుంది. అయితే మనకు కావలసిన మట్టి అరకిలో మాత్రమే. పొలంలో సేకరించిన మట్టిని ఒక శుభ్రమైన గోనె సంచి మీద గాని, గుడ్డ మీద గాని వేసి మట్టి గడ్డలను బాగా చిదిమి, కలిపి 1, 2, 3, 4 అను నాలుగు భాగాలుగా చేయాలి. వీటిలో 1, 3 భాగాలు ఉంచుకొని 2,4 భాగాలలోని మట్టి తీసివేయాలి. మిగిలిఉన్న మట్టిని మరల కలిపి అదే విధంగా నాలుగు భాగాలు చేసి 2,4 భాగాలు ఉంచుకొని, 1,3 భాగాలు తీసివేయాలి. సుమారు అర కిలో మట్టి మిగిలేవరకు ఈ విధంగా చేయాలి. దీనిని క్వార్టరింగ్ టెక్నిక్ అంటారు.

| | |
|---|---|
| 1 | 2 |
| 3 | 4 |

సేకరించిన మట్టి నమునాను ఒక శుభ్రమైన బట్ట సంచిలో కానీ లేదా ప్లాస్టిక్ సంచిలో కానీ వేసుకొని ఈ క్రింది నమాచార పత్రము జతపరిచి దగ్గరలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

1. రైతు పేరు
2. గ్రామం
3. పూర్తి చిరునామా
4. సర్వే నెంబర్
5. మండలం
6. జిల్లా
7. నమునా తేది
8. మట్టి లేదా పల్లమా
9. నేల రకం
10. వర్షాధారమా/నీటి పారుదల
11. గత సంవత్సరం వేసిన పైర్లు – దిగుబడులు
12. ఈ సంవత్సరం వేయదలచిన పైర్లు

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9966930035



# వివిధ పంటల్లో నీటి యాజమాన్యం

డా॥ పి. రేవతి, ఎస్.యం.ఎస్. రమ్య మరియు డా॥ పి. జగన్‌మోహన్ రావు
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల

నీరు అమూల్యమైన, పరిమితమైన సహజ వనరు. మన రాష్ట్రంలో లభ్యమయ్యే నీటిలో దాదాపు 95% వ్యవసాయ రంగంలోనే వినియోగిస్తున్నారు. ఇందులో సుమారు 65% వరి సేద్యం కోసం మళ్ళిస్తున్నారు.

పంట పొలాల ఉత్పాదకత పెంపొందించుటకు, పోషకాల వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి మరియు ఉత్పత్తిలో అంతరాలను పూరించడానికి సద్వినియోగం చాలా అవసరం.

నీటి నిర్వాహణలో వ్యూహాత్మక విధానం ఎంచుకొని సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమగ్ర యాజమాన్యం నీటి వనరులను పరిరక్షించటంలో మరియు మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ఉపయోగపడుతుంది.

ఈ సంవత్సరము వర్షాలు విస్తారంగా కురవడము మరియు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వలన రైతాంగం ఎక్కువగా వరి పంటపై మొగ్గు చూపుతున్నారు. కానీ మార్కెట్‌లో ధరలు ఎప్పుడు అవసరం - సరఫరా మీదే ఆధారపడి ఉంటాయి. కావున యాసంగిలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు పండించడం ద్వారా నీటి వినియోగత మరియు పంటల ఉత్పత్తి గణనీయముగా పెంచుకోవచ్చు. ఒక ఎకరం వరిసాగుకు అవసరమయ్యే నీటితో దాదాపు 3 ఎకరాలలో ఆరుతడి పంటలు సాగుచేసుకోవచ్చని రైతాంగం గుర్తించాలి.

## వివిధ పంటల్లో నీటి యాజమాన్యం

**వరి పంటకు నీటి అవసరాలు:** మన రాష్ట్రంలో వరి నీటి అవసరాలు ఈ క్రింది విధంగా అంచనా వేయడమైనది.

| | |
|---|---|
| నారుమడికి | 50 మి.మీ. |
| దమ్ము చేయుటకు | 200 మి.మీ. |
| వరి పెరుగుదలకు | 600 మి.మీ. |
| వృధాగా ఇంకేనీరు | 400 మి.మీ. |
| మొత్తం | 1250 మి.మీ. |

తేలిక నేలల్లో వరి పండించినప్పుడు చెరువు మట్టి తోలి, పచ్చి రొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు విరివిగా వేసి బాగా దమ్ముచేసి చదును చేయడం వల్ల వృధాగా ఇంకే నీటిని 20-25% వరకు తగ్గించవచ్చు. వరిలో సాగునీటి యాజమాన్యం ఒకే విధంగా కాక పంట పెరుగుదలకు అనుగుణంగా పాటిస్తే వృధాను అరికట్టవచ్చు.

1. **నాటు వేయునప్పుడు:** పల్చటి నీటి పొర ఉంచి నాటాలి. అందువల్ల మొక్కలు సరైన లోతులో నాటుటకు వీలుంటుంది. తద్వారా పిలకల సంఖ్య పెరిగి దిగుబడి పెరుగుతుంది.

2 **నాటు వేసిన తర్వాత 5 రోజుల వరకు:** 5 సెం.మీ. లోతు నీరు ఉండాలి. దీని వలన మొక్క నిలదొక్కుకుని వేర్లు మరియు ఆకులు ఏపుగా పెరగడం ఆరంభిస్తాయి.

3 **పిలక దశ:** నాటిన ఆరో రోజు నుండి 40-50 రోజుల వరకు మడిలో సుమారు 2 సెం.మీ. లోతు మించకుండా నీరుండాలి. పిలకలు తొడిగే సమయంలో నీటి లోతు పెరిగితే పిలక అంకురాలు నీటిలో మునిగిపోవుట వలన పైరులో పిలకల సంఖ్య తగ్గిపోతుంది. మొక్క ఎత్తు పెరుగుతుంది. ఈ దశలో పంట నీటి ఎద్దడికి గురైతే దిగుబడి 30% వరకు తగ్గే ప్రమాదముంది.

4 **అంకురం దశ-చిరుపొట్ట దశ - పూత దశ:** ఈ దశలకు చేరే సరికి వరి పంటకు నీటి అవసరం చాలా పెరుగుతుంది. కావున ఈ దశలో పంటకు 5 సెం.మీ. కంటే తక్కువ నీరు ఉండరాదు. పంట నీటి అవసరాలకు ఈ దశలు అత్యంత కీలకం. ఈ దశల్లో పైరు నీటి ఎద్దడికి గురైతే 50-60% దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పూత పూర్తయిన 21 రోజుల తర్వాత వరి పొలంలో నీటిని క్రమంగా తగ్గించాలి. దీని వల్ల పంటంతా ఒకేసారి పక్వానికి వస్తుంది.

దమ్ముచేసి నాటువేసే సాధరణ పద్ధతిలోనే ఆరుతడి విధానం (ఎ.డబ్ల్యు.డి)తో నీటి యాజమాన్యం పాటించినట్లయితే దిగుబడి తగ్గకుండానే సుమారు 15-30% నీటిని ఆదా

చేయవచ్చు. ఈ పద్ధతికి సుమారు 15సెం.మీ. వ్యాసం, 40 సెం.మీ. పొడవు గల పి.వి.సి. (ప్లాస్టిక్) పైపును వరి పొలంలో అమర్చుకున్నట్లయితే నీటి మట్టమును సులభంగా గమనించవచ్చును. ఎప్పుడైతే పైపులో నీటిమట్టం 3-5 సెం.మీ. (నేల మట్టం నుండి) తగ్గినచో పొలంలో నీటి మట్టం నేల మట్టం కన్నా 5 సెం.మీ. పైకి ఉండేటట్లు నీటిని పెట్టాలి. నాటిన నుండి చిరుపొట్ట దశ వరకు పైపులో నీటి మట్టం నేల మట్టం కన్నా 5 సెం.మీ. క్రిందకు తగ్గినచో పొలంలో నీటి మట్టం నేల మట్టంపై 5 సెం.మీ. పైకి ఉండేటట్లు నీటిని పెట్టాలి. పూత దశ నుండి గింజ పాలు పోసుకునే దశ వరకు పైపులో నీటి మట్టం నేల మట్టం కన్నా 3 సెం.మీ. (కిందకు తగ్గినప్పుడు) తిరిగి నీటిని నేల మట్టంపై 5 సెం.మీ. ఉండేటట్లు తడి పెట్టవలెను.

**మొక్కజొన్న:** మొక్కజొన్న సుమారు 500-800 మి.మీ. నీరు వివిధ పంట కాలంలో అవసరం. మొక్కజొన్నలో పూతకు ముందు, పూత మరియు గింజ పాలు పోసుకునే దశలు నీటికి బాగా సున్నితం. సాధారణంగా 6-8 నీటి తడులు పంటకాలంలో అవసరం. ముఖ్యంగా ఉదయం వేళల్లో ఆకులు చుట్టుకున్నట్లు కనిపిస్తే నీటి ఆవశ్యకత ఉన్నట్లుగా గమనించి నీటి తడి ఇవ్వాలి.

ప్రత్తి:- ప్రత్తి సాగుకు 600-800 మి.మీ. వర్షపాతం అవసరం ఉంటుంది. ప్రత్తి సాధారణంగా ఎక్కువ నీటిని గాని అధిక తేమను గాని తట్టుకోలేదు. కావున అవసరం మేరకు నీరు పెట్టాలి. ప్రత్తిలో పూత, పిందె, కాయ తయారయ్యే దశలు క్లిష్టమైనవి. కావున నీటి వసతి ఉన్నచోట క్లిష్టమైన దశలలో అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వడం ద్వారా పంట దిగుబడి బాగా వస్తుంది.

**వేరుశనగ:** వేరుశనగ పంటకు 450-600 మి.మీ. నీరు అవసరమవుతుంది. తేలిక నేలల్లో 6-8 తడులు ఇవ్వవలసి ఉంటుంది. మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ మరియు గింజకట్టే సమయం కీలకదశలు. కనుక ఈ దశలో నీరు సక్రమంగా తగు మోతాదులో కట్టాలి. తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చును.

**పెసర, మినుము:** పెసర, మినుము వానాకాలంలో వర్షాధారంగా పండిస్తారు. బెట్ట పరిస్థితులలో అవసరం మేరకు కీలక దశల్లో 1-2 తడులు ఇచ్చినచో మంచి దిగుబడులు సాధించవచ్చును.

యాసంగి, వేసవిలో నీటి పారుదల క్రింద పండిస్తారు. పంట కాలానికి 300-450 మి.మీ. నీరు అవసరం ఉంటుంది.

**కంది:** వానాకాలంలో వర్షాధారంగా పండిస్తారు. అవకాశం ఉన్న చోట పూత, కాయ తయారయ్యే దశలో 1 లేదా 2 తడులు ఇస్తే దిగుబడులు పెరుగుతాయి. యాసంగి కందికి సుమారు 250-300 మి.మీ. నీరు అవసరమౌతుంది. 4 లేదా 5 తడులు ఇవ్వాలి. మొగ్గ రాబోయే ముందు, కాయలు ఏర్పడే దశలో తప్పకుండా నీరు ఇవ్వాలి.

**ఆవాలు:** ఆవ పంటకు సుమారు 31-40 సెం.మీ. నీరు అవసరం. విత్తిన 30 రోజుల తర్వాత మొదటిగా మరియు 60-65 రోజుల తర్వాత 2వ సారి నీరు ఇవ్వాలి. నీటి పారుదల అందుబాటులో ఉన్నట్లయితే విత్తిన 30-35 రోజులకి ఒక తడి ఇవ్వాలి.

**ఆముదం:** సాధారణంగా ఆముదంను వర్షాధారంగా పండిస్తారు. అయితే బెట్ట పరిస్థితుల్లో నీటి వసతి ఉంటే 1-2 తడులు ఇస్తే 15-20% దిగుబడి పెరుగుతుంది. యాసంగిలో ఆముదంను విత్తిన తర్వాత నేల తడపాలి. మొక్కలు పుష్పించే దశ మరియు కాయ ఊరే దశల్లో నీటి ఎద్దడి లేకుండా నీరు ఇవ్వాలి.

**చెఱకు:** చెఱకు పంటకు సుమారు 1900-2700 మి.మీ. నీరు అవసరమౌతుంది. పిలకలు పెట్టేదశ అత్యంత కీలకమైన తేమ సున్నిత దశ. ఈ దశలో పంటకు 6 రోజులకొకసారి నీరు పెట్టాలి.

**కుసుమ:** బరువైన నేలల్లో పంటకు నీటి తడి ఇవ్వవలసిన అవసరం లేదు. తేలిక నేలల్లో 1,2 నీటి తడులు అవసరం. రకాన్ని బట్టి మరియు నేలల్లో తేమను బట్టి కుసుమలో పూత 65-75 రోజులకు వస్తుంది. వర్షాభావ పరిస్థితులలో కీలక దశలైన కాండం సాగే దశ (30-35 రోజులలో), పూత దశల్లో 65-75 రోజులలో ఒక తడి ఇచ్చినట్లయితే దిగుబడులు 40-60% పెరిగే అవకాశం ఉంటుంది.

**ప్రొద్దుతిరుగుడు:** నేలల రకాన్ని బట్టి, పగటి ఉష్ణోగ్రతను బట్టి ఎర్రనేలల్లో 8-10 రోజుల వ్యవధిలో, నల్లరేగడి నేలల్లో 15-20 రోజుల వ్యవధిలో నీటి తడులు పెట్టాలి. మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ మరియు గింజ కట్టే సమయం కీలకదశలు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9912944880**







# భారతదేశంలో నిషేధానికి గురైన, నమోదుకు నిరాకరించబడిన మరియు వాడకానికి పరిమితం చేయబడిన సస్యరక్షణ మందుల సమాచారం మరియు అవగాహన

డా॥ కె. కవిత, డా॥ జి. శ్రీదేవి మరియు ఎన్. జమీమా
అఖిల భారత సస్యరక్షణ మందుల అవశేషాల ప్రయోగశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

మన దేశ జనాభాకు ఆహార భద్రతను కల్పించాలంటే వివిధ పంటల ఉత్పత్తులను గణనీయంగా పెంచడమే కాకుండా ఆయా పంటలను ఆశించే చీడపీడల నుంచి రక్షించడం తప్పనిసరి. సుమారుగా 30% పంట నష్టం చీడపీడల వలన కలుగుతుంది. కావున రైతులు పంటను చీడపీడల నుండి కాపాడుకోవడానికి సస్యరక్షణ మందులను వాడతారు. మన దేశంలో రసాయన మందుల వాడకం గమనించినట్లైతే సుమారుగా 65% కీటకనాశినుల వాడకంగా నమోదు చేయబడింది.

ప్రస్తుతం మనదేశంలో 290 సస్యరక్షణ మందులు, 179 రకాల సస్యరక్షణ మందుల కలయికలు కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మరియు సహకార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ ఇన్సెక్టిసైడ్ బోర్డు మరియు రిజిస్ట్రేషన్ కమిటీ (సిఐబి మరియు ఆర్‌సి) ద్వారా వివిధ పంటలపై నిర్ధారించిన మోతాదులో వాడటానికి అనుమతించబడినవి. ఈ సస్యరక్షణ మందులను సిఫారసు చేసిన పంటలకు సిఫారసు చేసిన మోతాదులో వాడినట్లైతే ఎటువంటి హాని కలగదు. వీటిని విచక్షణారహితంగా వాడినప్పుడు దుష్ఫలితాలకు దారి తీస్తుంది.

మానవాళి లేదా జీవరాశులకు హాని కలిగించే కొన్ని సస్యరక్షణ మందులను పరిశోధన ప్రచురణల మేరకు క్రమేణా కేంద్ర ప్రభుత్వం జనవరి 1, 2021 నాటికి నిషేధించిన, నమోదులకు నిరాకరించిన మరియు వాడకానికి పరిమితం చేయబడిన సస్యరక్షణ మందుల సమాచారం దిగువన ఇవ్వడం జరిగింది. దీనిని రైతులు దృష్టిలో ఉంచుకొని వాడకానికి పరిమితం చేయబడిన మందులను సిఫారసు చేసిన ఉత్పత్తులలో సిఫారసు చేసిన మోతాదులో వాడి అవశేష రహిత పంట ఉత్పత్తులను పొందవచ్చు.

**ఎ. తయారీ, దిగుమతి మరియు వాడకానికి నిషేదింపబడిన సస్యరక్షణ మందులు :** సుమారుగా 46 సస్యరక్షణ మందులు (2-నులి పురుగు నాశికాలు, 27-కీటకనాశినులు, 6-శిలీంధ్రనాశికలు, 6-కలుపు నాశికలు, 1-అకారిసైడ్, 1 మైటిసైడ్, 1 మొక్కల పెరుగుదల నియంత్రకాలు, 1 కీటకనాశిని మరియు శిలీంధ్రనాశిని మరియు 1-కీటకనాశిని మరియు రొడెంటిసైడ్ జనవరి 1, 2021 నాటికి తయారీ, దిగుమతి మరియు వాడకానికి నిషేదింపబడినాయి.

1. అలాక్లోర్
2. ఆల్డికార్బ్
3. ఆల్డ్రిన్
4. బెంజిన్‌హైక్సాక్లోరైడ్
5. బెనోమిల్
6. కాల్షియం సైనైడ్
7. కార్బరిల్
8. క్లోర్‌బెంజిలేట్
9. క్లోర్డేన్
10. క్లోరోఫెన్‌విన్‌ఫాస్
11. కాపర్ అసిటోఆర్సినేట్
12. డయాజినాన్
13. డైబ్రోమోక్లోరో ప్రోపేన్
14. డైక్లోరోవాస్
15. డైఆల్డ్రిన్
16. ఎండోసల్ఫాన్
17. ఎన్డ్రిన్
18. ఇథైల్ మెర్క్యూరీ క్లోరైడ్
19. ఇథైల్‌పారాథియాన్
20. ఇథిలిన్‌డైబ్రోమైడ్
21. ఫెనారిమాల్
22. ఫెంథియాన్
23. హెప్టాక్లోర్
24. లిండేన్
25. లినురాన్
26. మాలిక్ హైడ్రజైడ్
27. మినజాన్
28. మిథాక్సీ ఇథైల్ మెర్క్యూరి క్లోరైడ్
29. మిథైల్ పారాథియాన్
30. మెటాక్సురాన్
31. నైట్రోఫెన్
32. పారాక్వాట్ డైమిథైల్ సల్ఫేట్
33. పెంటాక్లోరో నైట్రోబెంజిన్
34. పెంటాక్లోరోఫీనాల్
35. ఫినైల్ మెర్క్యూరీ ఎసిటేట్
36. ఫోరేట్
37. ఫాస్ఫామిడాన్
38. సోడియం సాయనైడ్
39. సోడియం మిథేన్ ఆర్సినేట్
40. టెట్రాడైఫాన్

41. థయోమిటాన్ 42. టాక్సఫీన్ 43. ట్రైజోఫాస్ 44. ట్రైడిమార్ఫ్

45. ట్రైక్లోరో ఎసిటిక్ ఆసిడ్ 46. ట్రైక్లోర్ఫాన్

బి. పురుగు మందుల సూత్రీకరణలు, దిగుమతి, తయారీ మరియు వాడకానికి నిషిద్ధం (4 నం.) : కార్బోఫ్యూరాన్, మిథోమిల్ 12.5% ఎల్, మిథోమిల్ 24%, ఫాస్ఫామిడాన్ 85% ఎస్.ఎల్

సి. పురుగు మందు / పురుగు మందుల సూత్రీకరణలు వాడకానికి నిషేధింపబడి ఎగుమతి కోసం తయారీని కొనసాగించడం (5): కాప్టఫాల్ 80%, డైక్లోరోవాస్, నికోటిన్ సల్ఫేట్, ఫోరేట్, ట్రైజోఫాస్

డి. ఉపసంహరించుకున్న సస్యరక్షణ మందులు (8) : డాలాపోన్, ఫర్బమ్, ఫార్మోథియాన్, నికేల్ క్లోరైడ్, పారాడైక్లోరో బెంజిన్, సిమాజిన్, సిర్మేట్, వార్ఫరిన్

**2. నమోదుకు నిరాకరింపబడిన సస్యరక్షణ మందులు (18) :** 2,4,5-టి, అమ్మోనియం సల్ఫేట్, అజిన్ఫాస్ ఇథైల్, అజిన్ఫాస్ మిథైల్, బినాపక్రిల్, కాల్షియం ఆర్సినేట్, కార్బోఫెనోథియాన్, క్లైనోమిథియోనేట్, డైక్రోటోఫాస్ ఇ.పి.ఎన్, ఫెన్టిన్ ఎసిటేట్, ఫెన్టిన్ హైడ్రాక్సైడ్, లెడ్ ఆర్సినేట్, లెప్టోఫాస్, మిఫాస్ఫోలన్, మెవిన్ఫాస్, థయోడిమెటాన్ మరియు వామిడోథయాన్

**3. భారతదేశంలో వాడకానికి పరిమితం చేయబడ్డ సస్యరక్షణ మందులు :** అల్యూమినియం ఫాస్ఫైడ్, కాప్టఫాల్, సైపరిమెత్రిన్, డైక్లోరో డైఫినాయిల్ ట్రైక్లోరో ఇథేన్, ఫెనిట్రోథియాన్, మిథైల్ బ్రోమైడ్, మోనోక్రోటోఫాస్ మరియు ట్రైఫ్లూరాలిన్.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9440651379**

**29వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు**

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | 4 సే | | | 5 వ్య |
| 1 అ | న్న | 3 పూ | ర్ణ | కృ | షి | ప్ర | సా | ర | సే | వ |
| న్న | | నా | | | | | మీ | | | సా |
| దా | | స | | | 2 కా | ర్తా | గో | ల్డ్ | | యం |
| త | | | | | సు | | ల్డ్ | | | |
| | | | | | గా | | | | | |
| | | | | | 3 మై | నం | | | 7 బ | |
| | | | | | సి | | | | ట | |
| | | 4 ఫా | 6 స | లో | న్ | | | 5 బ్రా | నిం | గ్ |
| | | | ఫో | | | | | | గ్ | |
| | | | ట | | | | | | | |



# మిరపలో కోత మరియు కోతానంతరం చేపట్టవలసిన జాగ్రత్తలు

డా॥ వి. చైతన్య, డా॥ జె. హేమంత్ కుమార్, డా॥ కె. రవికుమార్, పి.ఎస్.ఎమ్. ఫణిశ్రీ మరియు డా॥ జెస్సీ సునీత దబ్ల్యు
కృషి విజ్ఞాన కేంద్రం, వైరా

తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్యపరంగా పండించే పంటల్లో ప్రధానమైనది మిరప. మన రాష్ట్రంలో సుమారు 0.85 లక్షల హెక్టార్లలో సాగవుతూ దేశంలో పండించే మిరపలో 2వ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో పండించే మిరపను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తేకాక అంతర్జాతీయ మార్కెట్‌కు కావలసిన నాణ్యతా ప్రమాణాలు, వాణిజ్య అవకాశాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఎదుర్కొని ఎగుమతులు పెంచాలంటే పంట కోత తరువాత జాగ్రత్తలు, ఆరుదల పద్ధతుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. నాణ్యత గల ఉత్పత్తులను తయారుచేయగల నైపుణ్యం ఎంతో అవసరం.

1. మిరపను సాధారణంగా వర్షాధారపు పైరులో 3-4 కోతలు, నీటి ఆధారపు పైరులో 6-8 కోతలు కోయాలి.
2. ఏ కోతకి ఆ కోత కాయలను వేరు వేరు ఆరుదల చేయాలి.
3. పలుచని గుజ్జు, ఎక్కువ ఘన పదార్థం ఉన్న మిరప రకాలు తొందరగా ఎండుతాయి.
4. మొక్కలపై కాయలు పూర్తిగా పండిన తర్వాతనే కోయాలి. మరీ ఎక్కువగా పండనిస్తే కాయలపై ముడతలు పడి, సూర్యరశ్మి అధికంగా సోకి రంగు తగ్గి, నాణ్యత కోల్పోతుంది.
5. సరైన వాతావరణ పరిస్థితుల్లో మాత్రమే అంటే పొడి వాతావరణంలోనే కాయలు కోయాలి.
6. కాయలు కోసిన తర్వాత ఒక రోజు రాసిగా పోసి ఎండబెట్టడం వలన అన్ని కాయలు సరిసమానంగా పండుతాయి.
7. అఫ్లోటాక్సిన్ వృద్ధి కాకుండా మిరప కాయలను పాలిథీన్ పట్టాల మీద లేదా సిమెంట్ గచ్చుల మీద ఎండబెట్టాలి.
8. కాయలోని తేమ శాతం సుమారు 70-80 శాతం నుండి 10-11 శాతం వరకు వచ్చేలా ఎండబెట్టాలి.
9. ఎండబెట్టేటప్పుడు దుమ్ము, ధూళి, చెత్త, చెదారం చేరకుండా కాయలు శుభ్రంగా ఉండేటట్లు చూడాలి.
10. కాయలు ఎండబెట్టే దగ్గర పెంపుడు జంతువులు, ఎలుకలు మరియు పందికొక్కులు రాకుండా జాగ్రత్త పడాలి.
11. తాలు కాయలను, మచ్చ కాయలను గ్రేడింగ్ చేసి వేరు చేయాలి.
12. నిల్వ చేయడానికి తేమ లేనటువంటి శుభ్రమైన గోనె సంచుల్లో కాయలు నింపాలి.
13. తేమ తగలకుండా వరి పొట్టు లేదా చెక్క బల్లల మీద గోడలకు 50-60 సెం.మీ. దూరంలో నిల్వ ఉంచాలి.
14. అవకాశం ఉన్న చోట శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తే రంగు నాణ్యత తగ్గిపోకుండా లాభదాయకంగా ఉంటుంది.
15. కాయలు నిగనిగలాడుతూ మంచి రంగు రావాలంటే ఏవిధమైన రసాయనాలను, రంగులను వాడకూడదు.
16. అకాల వర్షాలకు గురికాకుండా, మంచు బారిన పడకుండా, రంగు కోల్పోకుండా ఆధునిక డ్రయర్లలో ఎండబెట్టి నాణ్యమైన మిరప కాయలను పొందవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441632227





# మార్చి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

**మామిడి:** ఆలస్యంగా పూత, పిందె వచ్చిన తోటల్లో పిందె రాలుటను నివారించుటకు 4.5 లీటర్ల నీటిలో 1 మి.లీ. ప్లానోఫిక్స్ కలిపి పిచికారి చేయాలి. తేనె మంచు పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లయితే నల్లపూత దశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. కాయ తొలుచు పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా 5 శాతం వేప గింజల కషాయం లేదా డెల్టామెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి గోలీకాయ దశలో 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. టెంక పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి గోలీకాయ దశ నుండి రెండు సార్లు మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి. నేల స్వభావాన్ని, వాతావరణాన్ని బట్టి కంది గింజ సైజు పిందె నుంచి 15-20 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి.

**జామ:** జామలో పిండినల్లి ఉధృతి అధికంగా కనిపిస్తున్నది. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ.+ వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి చెట్టుపై మరియు పాదులో పిచికారి చేయాలి. ఆకు, కాయ మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడు 3 గ్రా. లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**అరటి:** ఈ మాసంలో ఫ్లీ బీటిల్స్ (చిత్తపురుగులు) ఉధృతి అధికంగా ఉంటుంది. ఇవి విచ్చుకొనని లేత ఆకులను తింటూ ఆకుల అడుగు భాగాన దాక్కొంటాయి. మధ్య ఆకు మీద వీటి ప్రభావం అధికంగా ఉంటుంది. కాయల మీద మచ్చలు ఏర్పడటం వల్ల మార్కెటింగ్‌కు పనికిరావు. కొత్తగా వచ్చే ఆకుల మీద మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**బత్తాయి, నిమ్మ:** ప్రస్తుత వాతావరణం నల్లి ఆశించడానికి అనుకూలం. నివారణకు 3 మి.లీ. ప్రొపర్‌గైట్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఈ మాసంలో పిందె రాలుతుంటే 2,4-డి 1 గ్రా., యూరియా 1 కిలో, కార్బండాజిమ్ 100 గ్రా. 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అదే విధంగా ఈ మాసంలో ఉష్ణోగ్రత 35-40 డిగ్రీ సెం.గ్రే. మధ్యలో ఉంటే 2,4-డి 1 గ్రా., పొటాషియం పర్మాంగనేటు 1 కిలో 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** పండ్లలో నాణ్యతను పెంచేందుకు నీటిని తగ్గించాలి. ఎకరాకు 60 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. పండ్ల పరిమాణం 7-8 మి.మీ. ఉన్నప్పుడు 2 పి.పి.యం. ఇథరిల్ మరియు 40 పి.పి.యం. జిబ్బరెల్లిక్ ఆమ్ల ద్రావణంలో గుత్తులను ముంచడం వల్ల పండ్ల రంగు మరియు పరిమాణం పెంచవచ్చు.

**బొప్పాయి:** పండు ఈగ నివారణకు చెట్ల కింద రాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. మిథైల్ యూజినాల్ 1 మి.లీ., 2 గ్రా. కార్బోఫ్యూరాన్ లీటరు నీటిలో కలిపి వెడల్పాటి మట్టి పళ్ళాలలో పోసి అక్కడక్కడా ఉంచాలి.

**జీడిమామిడి:** కాయ, గింజ తినే పురుగు కాయ, గింజల మధ్య గల ప్రదేశం ద్వారా లోపలికి ప్రవేశించి పండులోని గుజ్జును, గింజలోని పప్పును తింటుంది. వీటి నివారణకు ఈ మాసంలో లామ్డాసైహాలోత్రిన్ 0.6 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మాడు తెగులు వల్ల పుష్పగుచ్ఛాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి, పూర్తిగా ఎదగక ఎండి రాలిపోతాయి. అవసరాన్ని బట్టి కార్బండాజిమ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.





**ఆపిల్ రేగు:** కోత పూర్తయిన తోటల్లో ఈ మాసంలో కత్తిరింపులు చేయాలి. ప్రధాన కొమ్మలు 3-4 లను 15-20 కణుపులుంచి మిగతావి కత్తిరించాలి. కత్తిరింపులకు ముందుగా 10 గ్రా. పొటాషియం నైట్రేటును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల త్వరగా చిగురిస్తాయి.

**కూరగాయలు:**

**టమాట:** వేసవి టమాట నాటిన 30, 45 రోజులకు లీటరు నీటికి 5 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేసినట్లయితే దిగుబడులు పెరుగుతాయి. పూత దశలో లీటరు నీటికి 20 గ్రా. యూరియాను కలిపి పిచికారి చేస్తే 20 శాతం దిగుబడి పెరుగుతుంది.

**వంగ:** కొమ్మ, కాయ తొలుచు పురుగుల నివారణకు 0.4 గ్రా. ఫ్లూబెండమైడ్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిల్‌ప్రోల్ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. నాటిన 30వ, 45వ రోజున ఎకరాకు 50 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. పూత దశలో లీటరు నీటికి 5 గ్రా. సూక్ష్మధాతు పోషక పదార్థాల మిశ్రమంను పిచికారి చేయడం వల్ల దిగుబడులు పెరుగుతాయి.

**మిరప:** కాయ కుళ్ళు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడు లేదా 2 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు నివారణకు 1 మి.లీ. డైనోకాప్ లేదా 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ లేదా 0.4 గ్రా. మైక్లోబ్యుటానిల్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. మిరప కాయలను కోసే ముందు సస్యరక్షణ మందులను పిచికారి చేయకూడదు. అఫ్లోటాక్సిన్లు వృద్ధి చెందకుండా మిరప కాయలను పట్టాల మీద ఎండబెట్టాలి. రాత్రిళ్ళు మంచు బారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి.

**పందిరి కూరగాయలు:** సొర, కాకర, బీర కాయలలో పండు ఈగ నివారణకు ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలను (క్యూలూర్) అమర్చుకోవాలి. పెంకు పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పేనుబంక నివారణకు పెరుగుదల దశ నుండి పూత వచ్చే వరకు 5 శాతం వేపగింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉంటే 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకుకూరలు:** ఆకు తినే గొంగళి పురుగుల నివారణకు 2 మి.లీ. మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు మందు పిచికారి చేసిన తరువాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి. అన్ని రకాల కూరగాయలలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఆగాకర:** ఆగాకర పంట వేయాలనుకునేవారు ఈ మాసం చివరిలో నారు పోసుకుంటే జూన్‌లో నాటుటకు తయారవుతాయి. నారుమడిని 4×1 మీ. సైజులో తయారు చేసుకొని వరుసల మధ్య 15 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ. ఉండేటట్లు విత్తనాలు విత్తుకోవాలి. 40-45 రోజుల్లో మొలకలు వస్తాయి.

**పసుపు:** ఉడికిన పసుపు తొందరగా ఎండక పోవడం వల్ల అఫ్లోటాక్సిన్లు వృద్ధి చెందే అవకాశం ఉంది. నివారణకు వండిన పసుపును ఆరబెట్టేటప్పుడు పైకి, కిందకు తిప్పుతుండాలి. తేమశాతం 8 వచ్చే వరకు ఎండబెట్టాలి. ఎండబెట్టేటప్పుడు వర్షంలో తడవకుండా కప్పిఉంచాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441168156**





# వేసవిలో ఆకుకూరల సాగు - లాభాలు బాగు

కె. సరిత మరియు కె. రాహుల్ విశ్వకర్మ
ఏరువాక కేంద్రం, జోగిపేట, సంగారెడ్డి

గోంగూర, తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా, బచ్చలి సీజన్‌తో సంబంధం లేకుండా వీటిని ఏడాది పొడవునా లాభసాటిగా పండించవచ్చు. వేసవిలోని అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల వలన భూమిలో తేమ ఆవిరి అయిపోతుంది. ఫలితంగా మొక్కలు వడలిపోతాయి. ఒకవేళ నీరు ఉన్నా విద్యుత్ సమస్యలతో కూడ నీటిని సక్రమంగా అందించలేకపోవచ్చు. అయితే కొద్దిపాటి మెళకువలు పాటించి వేసవిలోనూ ఆకుకూరల సాగు చేస్తూ అధిక లాభాలు పొందవచ్చు. ఏడాది పొడవునా ఆకు కూరలకు డిమాండ్ ఉంటుంది. ఈ ఆకుకూరలు ఆరోగ్యాన్ని మెరుగుపరిచేవి కాబట్టి రోజువారి వంటలో తప్పనిసరి అయ్యాయి. అంతేకాక హెూటళ్ళకు కూడా వీటి అవసరం ఉన్నందువల్ల డిమాండ్ రోజు రోజుకు పెరుగుతుంది.

మరీ ముఖ్యంగా కొత్తిమీర, మెంతికూర, పుదీనాకు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది.

ఆకుకూరల సాగు మెట్ట ప్రాంతాల్లో అనుకూలమైన లాభాలను అందిస్తాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రత, తక్కువ నీటి లభ్యత వల్ల కూరగాయల సాగు విస్తీర్ణం, లభ్యత తగ్గుతుంది. కాబట్టి ధరలు అధికంగా ఉంటాయి. ఈ సమయంలో మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే మంచి పోషక విలువలు గల ఆకుకూరలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. రైతులకు ఉన్న పరిమిత వనరులతో అవసరాలకు అనుగుణంగా కొద్దిపాటి విస్తీర్ణంలో ఆకుకూరల సాగు చేసుకున్నట్లైతే, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చు. వేసవిలో సాగునీటి సమస్య ఉంటుంది. కాబట్టి తేమ నిలుపుకోగల, బరువైన నల్లరేగడి భూములు అనుకూలంగా ఉంటాయి. నీటి వసతి ఉంటే ఎర్రభూములు, ఇసుక భూములు ఎంపిక చేసుకోవాలి. ఆకుకూరలకు తుంపర్ల



పద్ధతిలో నీటిని అందిస్తే నీటి సమర్ధ వినియోగంతో పాటు ఆకుకూరలను ఎండ తీవ్రత నుండి కాపాడి అధిక దిగుబడులను సాధించవచ్చు. ముఖ్యంగా వేసవి సాగుకు సూచించిన రకాలను ఎంపిక చేసుకుంటే అవి నీటి ఎద్దడిని తట్టుకొని మంచి దిగుబడులను ఇస్తాయి. వేసవిలో సాగుకు తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర అనువైనవి.

**గోంగూర :** ఎఎన్‌జిఆర్‌ఎయు-12, ఎర్రగోంగూర, లోకల్ రకాలను ఎంపిక చేసుకోవాలి. సాగుకు నీరు ఇంకే అన్ని నేలలు అనుకూలం. నల్ల రేగడి నేలల్లో బాగా పండుతుంది. 15-20 కిలోల విత్తనం ఎకరానికి సరిపోతుంది. విత్తిన రెండు నెలలకు పంట చేతికి వచ్చి, ఎకరానికి 30 క్వి. దిగుబడితో మంచి ఆదాయం వస్తుంది.

**తోటకూర :** ఆర్.ఎస్.ఎ. 1, అర్కసుగుణ, అర్కఅరుణ, పూసాకీర్తి ఎరుపురకాలు సాగుకు అనువైనవి. జనవరి-మే మధ్య విత్తుకోవచ్చు. ఎకరానికి 800 గ్రా. విత్తనం అవసరం అవుతుంది. విత్తేటప్పుడు 10 రెట్ల ఇసుకతో కలుపుకొని వేసుకోవాలి. విత్తిన 25 రోజులకు కోత మొదలు అవుతుంది. మొదటి కోత తరువాత ప్రతి 10 రోజులకు కోత తీయవచ్చు. ఎకరానికి 40-50 క్వి. దిగుబడి వస్తుంది.

**మెంతికూర :** పుసా ఎర్లీబంచిగ్, లాంసెలక్షన్-1 రకాలు సాగుకు అనువైనవి. సుగంధ ద్రవ్య పంటల్లో మెంతి ఒకటి. ఇసుక, నీరు ఇంకే ఒండ్రు భూములు అనుకూలం, ఎకరానికి 6-10 కిలోల విత్తిన మోతాదు అవసరం అవుతుంది. విత్తిన 25-30 రోజులలో మొదటి కోత తీసుకోవచ్చు. 15 రోజులకొకసారి 3 సార్లు కోత కోయవచ్చు. ఎకరానికి 40 క్వి॥పైన దిగుబడి వస్తుంది.

**కొత్తిమీర :** సాధన, స్వాతి రకాలు సాగుకు అనువైనవి. సుగంధ ద్రవ్య పంట. అధిక ఆమ్ల, క్షార గుణాలు లేని నేలలు, నీరు ఇంకే భూములు సాగుకు అనుకూలం. ఏడాది పొడవునా దీనిని సాగు చేయవచ్చు. విత్తనాలను విత్తేముందు 5-6 గంటలు నానబెట్టాలి. ఎకరాకు 8-10 కిలోల విత్తనం అవసరం. విత్తిన నెల రోజులకి కోతకు వస్తుంది. ఎకరాకు 15-20 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది.

**పుదీనా :** ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు అనుకూలం, చల్లని వాతావరణం సరిపడదు. ఈ పంటకు విత్తనాలు ఉండవు. కొమ్మలను ముక్కలుగా చేసి నాటాలి. ఎకరానికి 4.5 క్వి. ముక్కలు అవసరం. ఇందులో జపాన్ పుదీనా, హిమాలయ పుదీనా, కోపి, శిలిక్ రకాలు అనుకూలం. నాటిన 4 నెలల నుండి కోత ఆరంభం అవుతుంది. 8 నెలల నుండి 30-40 క్వి. దిగుబడి వస్తుంది.

**పాలకూర :** పూసా జ్యోతి, పుసాపాలక్, ఆల్‌గ్రీన్ రకాలు సాగుకు అనుకూలం. సమశీతోష్ణ పరిస్థితులు పాలకూర సాగుకు అనుకూలం. $35^{0}$ సె. ఉష్ణోగ్రత దాటితే ఆకులు ఎరుపుగా మారుతాయి. నీరు ఇంకే భూములు, చౌడు నేలల్లో సాగు వీలుగా ఉంటుంది. పంటకాలం 3 నెలలు, 10-12 కిలోల విత్తనం ఎకరానికి అవసరం పడుతుంది. విత్తిన తరువాత 4-5 వారాలలో పంట చేతికి వస్తుంది. వారం వ్యవధిలో కోతల్లో 40 క్వి. దిగుబడి వస్తుంది.

సమయానుకూలంగా వ్యవసాయంలో డిమాండ్‌కు తగ్గట్టు పంటను సాగుచేస్తూ అధిక లాభాలు పొందేలా రైతులు అడుగులు వేయాలి. తక్కువ కాలంలో పంట చేతికి వచ్చి, ఆర్థికంగా ఆసారాగా నిలిచే ఆకుకూరలు పండించాలి. దళారులు లేకుండా మార్కెట్‌లో అమ్మితే మంచి లాభాలు అర్జించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.8074151952





తామర పురుగులు



ఆకు జాలె గూడు పురుగు

# మామిడిలో సస్యరక్షణ

డా॥ ఎస్. ఉపేంధర్ మరియు డా॥ కె. వాణిశ్రీ
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం
రాజేంద్రనగర్, హైదరాబాద్

మామిడి సాగులో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. మన రాష్ట్రంలో సాగుచేయబడుతున్న పండ్ల తోటల్లో మామిడి అతి ముఖ్యమైనది. తెలంగాణలో ముఖ్యంగా కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి తోటలు పూత మరియు కాయ దశలో ఉన్నాయి. పూత మరియు కాయ దశలో అనేక రకాల పురుగులు ఆశించి తీవ్రనష్టాన్ని కలుగజేస్తాయి. తగిన సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టడం వలన అధిక దిగుబడులు పొందవచ్చును.

**తేనె మంచు పురుగులు:** తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పూలు మరియు పిందెల నుండి రసాన్ని పీలుస్తాయి. దీని వలన పూత, పిందె వాడి రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనె లాంటి తియ్యని పదార్థంపై శిలీంధ్రాలు పెరిగి ఆకులపై, పూత మరియు కాయలపై నల్లని మసి మంగు ఏర్పడుతుంది. తేనె మంచు పురుగులు కాయ లేని సమయంలో చెట్ల కాండం మరియు కొమ్మల బెరడులోని పగుళ్ళలో దాక్కొని ఉంటాయి. ఈ పురుగుల వలన 20-100 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది.

**నివారణ:** పూమొగ్గ దశలో థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



పిండినల్లి

**కాండం తొలుచు పురుగు:** ఈ పురుగు ఆశించిన కాండం మరియు కొమ్మల నుండి బంక కారడం, పురుగు చేసిన రంధ్రాల నుండి వెలువడే విసర్జితాలు మరియు నమిలిన రంపపు పొట్టు బయటకు వస్తుంది. లోపల పురుగు ఉన్నట్లుగా గుర్తించవచ్చు. ఈ పురుగు ఆశించిన చెట్ల ఆకులు పసుపు రంగుకు మారి తరువాత చెట్ల చివరి రెమ్మలు, కొమ్మలు ఎండి తీవ్ర పరిస్థితుల్లో లేదా సకాలంలో నివారణ చర్యలు చేపట్టని యెడల చెట్టు మొత్తం చనిపోయే ప్రమాదం ఉంది.

**నివారణ:** మామిడి తోటలను శుభ్రంగా ఉంచవలెను. ఇనుప చువ్వలను ఉపయోగించి చెట్టుపై ఉన్న రంధ్రాలలోని పిల్ల పురుగులను బయటికి తీసి నాశనం చేయాలి. ఈ పురుగులు



టెంక పురుగు



కాండం తొలుచు పురుగు



టెంక పురుగు

చేసిన రంధ్రాల్లో 5 మి.లీ. కార్బన్ డై సల్ఫేట్ లేదా కిరోసిన్ లేదా పెట్రోల్ లేదా క్లోరోఫామ్ ద్రావణంలో ముంచి తీసిన దూది వత్తును లోపల ఉంచి బంక మట్టితో మూసి వేయాలి. కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఒక అల్యూమినియం ఫాస్ఫైడ్ టాబ్లెట్‌ని పురుగు చేసిన రంధ్రంలో పెట్టి బంక మట్టితో మూసి వేయాలి.

**టెంక పురుగు:** పిందెలు గోళీకాయ పరిమాణంలో ఉన్నప్పుడే తల్లి పురుగులు పిందెపై గ్రుడ్లు పెడతాయి. గ్రుడ్లు నుండి బయటికి వచ్చిన పిల్ల పురుగులు కాయలోని టెంకలోకి చొచ్చుకొని పోయి తీవ్రనష్టాన్ని కలుగ చేస్తాయి.

**నివారణ:** పురుగు ఆశించిన పండ్లను ఏరి నాశనం చేయాలి. కాయదశలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫెనిట్రోథియాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పండు ఈగ:** తల్లి పురుగులు పండ్లపై గ్రుడ్లను పెడతాయి. గ్రుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు పండ్లను తొలచి లోపలి గుజ్జును తిని నష్టపరుస్తాయి. అందువలన పండ్లు ముందుగానే రాలి క్రింద పడతాయి. అలాగే ఈ పురుగు ఆశించిన పండ్లను కుళ్ళేటట్లు చేసి నష్టాన్ని తీవ్రతరం చేస్తాయి. దీని నివారణకు కింద పడిన, కుళ్ళిన పండ్లను ఏరి నాశనం చేయాలి. పండు ఈగ ఎరలను (మలాథియాన్ 2 మి.లీ. + మిథైల్ యూజినాల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి) ఒక్కొక్క ప్లాస్టిక్ కంటైనర్‌లో 200 మి.లీ. ఉంచి చెట్టు కొమ్మలకు వ్రేలాడదీయాలి.

**పిండినల్లి:** తల్లి పురుగులు చెట్టు పాదుల్లోని మట్టిలో గ్రుడ్లు పెడతాయి. ఈ గ్రుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులు పాకడం ద్వారా లేదా చీమల ద్వారా కాయలపై మరియు కాయ తొడిమల పైకి చేరతాయి. ఈ పురుగులు పూరెమ్మలు, కాయలు, తొడిమలపైకి చేరి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. వీటి తీవ్రత ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధికంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా ఆశించిన కాయలు సరిగా ఎదగకుండా పోతాయి. దీని నివారణకు పాలీథీన్ పేపరును అడుగు ఎత్తు వరకు చెట్టు మొదలు దగ్గర బెరడుకు చుట్టి పిండినల్లిని నివారించవచ్చు. పిండినల్లి ఆశించిన రెమ్మలు, కాయలపై ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా పాస్ఫామిడాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకు జల్లెడ గూడు పురుగు:** ఈ పురుగు లద్దె పురుగులు ఆకుల మధ్య ఉన్న కణజాలాన్ని తినేసి జల్లెడలాగా చేసి గూడు ఏర్పరచుకుంటాయి. పూత దశలో పూగుత్తులను కూడా గూడుగా ఏర్పరచుకోవడం వల్ల పూత రాలిపోయి పిందెలు ఏర్పడవు. దీని నివారణకు ఈ పురుగు గూళ్ళను ఇనుప కొక్కెము కలిగిన పొడవాటి వెదురు కర్రతో తొలగించి నాశనము చేయాలి. ఆ తరువాత 2 మి.లీ. క్వినాల్‌ఫాస్ లేదా 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** ఈ తామర పురుగులు పుష్పగుచ్ఛాలపై, పిందెలపై చర్మం గీకి రసం పీల్చడం వలన వక్క రంగులో చర్మం బీటలు వారి గరుకు మచ్చలు ఏర్పడుతాయి. దీన్నే రాతి మంగు అంటారు. దీని వలన నాణ్యత తగ్గి సరైన మార్కెట్ ధర పలకదు. వీటి నివారణకు పిందె దశలో ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9948499284**


టెంక పురుగు


పండు ఈగ


పండు ఈగ


తామర పురుగులు


కాండం తొలుచు పురుగు









# క్యాబేజి జాతి కూరగాయలలో సమగ్ర సస్యరక్షణ

యం. రాజశేఖర్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, బి. రాజశేఖర్, కె. రామకృష్ణ,
డా॥ అదిశంకర్, డా॥ అఫీపా జహాన్ మరియు శ్రావిక
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

శీతాకాలంలో సాగు చేస్తున్న కూరగాయ పంటల్లో క్యాబేజీ, కాలీఫ్లవర్, ముల్లంగి ముఖ్యమైనవి. ఈ కూరగాయ పంటల్లో విటమిన్ ఎ, బి, సితో పాటు శరీరానికి కావల్సిన పోషకాలు కాల్షియం, సోడియం, పొటాషియం, ఇనుము వంటి ఖనిజములు సమృద్ధిగా ఉంటాయి. అయితే ఈ పంటలు ప్రస్తుతం పూత నుండి కాయలు ఏర్పడే దశలో ఉన్నాయి. ఈ దశలలో చాలా చీడపీడలు ఆశించి వీటిని విపరీతంగా నష్టపరుస్తున్నాయి. కావున సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన ఈ పురుగుల ఉధృతిని తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చు.

**ఆకు గూడు పురుగు:** ఈ పురుగు క్యాబేజి జాతి మొక్కల అన్నింటినీ ఆశించి త్రీవంగా నష్టపరుస్తుంది. తల్లి రెక్కల పురుగు లేత ఆకుల అడుగుభాగాన గ్రుడ్లను పెడుతుంది. పిల్ల లార్వాలు ఆకులపై ఉంటూ గూడు కట్టుకుని అందులో ఉంటూ నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. సైఫర్‌మెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**క్యాబేజి సీతాకోకచిలుక:** ఈ పురుగు యొక్క లార్వాలు గుంపులు గుంపులుగా చేరి ఆకులలోని పత్రహరితాన్ని గీకి తింటూ ఇతర ఆకుల మీదకు వ్యాప్తి చెందుతాయి. ఆకులంతా జల్లెడాకులుగా మారుస్తాయి. బాగా ఎదిగిన లార్వాలు గడ్డలలోకి చేరి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. దీని నివారణకు ముందుగా గుంపులుగా ఉన్న లార్వాలను ఏరి నాశనం చేయాలి. తర్వాత ఉధృతి అధికంగా ఉంటే డెల్టామెత్రిన్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా

ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైక్లోరోవాస్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**క్యాబేజి పెయింటెడ్ బగ్స్:** ఈ పురుగు అన్ని క్యాబేజి జాతి పంటలను అన్ని ప్రాంతాల్లో ఆశిస్తుంది. పిల్ల మరియు తల్లి పురుగులు రసం పీల్చడం వలన ఆకులు పసుపు పచ్చగా మారి ఎండి రాలిపోవును. ఈ పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దిగుబడి కూడా తగ్గిపోతుంది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**పొగాకు లద్దె పురుగు:** తల్లి రెక్కల పురుగు లేత ఆకుల మీద గుంపులు గుంపులుగా గ్రుడ్లను పెడతాయి. వీటి నుండి పొదిగిన లార్వాలు తొలిదశలో ఆకుల మీద రంధ్రాలు చేస్తాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మొత్తం ఆకులను తినేసి మధ్య ఈనెలను మాత్రమే మిగుల్చుతాయి. కొన్నిసార్లు క్యాబేజి గడ్డలలోకి చొచ్చుకొని పోవడం వలన మార్కెట్ ధర తక్కువగా లభిస్తుంది.

**నివారణ చర్యలు:** ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకొని పురుగు ఉధృతిని గమనిస్తూ ఉండాలి. తొలిదశలో అజాడిరాక్టిన్ 1500 పి.పి.యం. 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. విషపు ఎరను తయారు చేసుకోవాలి (10 కిలోల తవుడులో 1 కిలో బెల్లంను కలిపి ఒక రాత్రి అంతా పులియబెట్టి మరుసటి రోజు సాయంత్రం 1 లీటరు మలాథియన్ ద్రావణాన్ని కలిపి సాయంత్రం వేళల్లో మొక్కల మధ్య చిన్న చిన్న ఉండలుగా చేసుకొని చల్లుకోవాలి. ఉధృతి ఆర్థిక నష్టపరిమితి స్థాయిని దాటినప్పుడు థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**డైమండ్ బ్యాక్ మాత్:** ఈ పురుగు క్యాబేజి, కాలీఫ్లవర్, ఆవాలు పంటను ఎక్కువగా ఆశిస్తుంది. గ్రుడ్ల నుండి పొదిగిన లార్వాలు ఆకుల కణజాలాన్ని గీకి తిని ఆకులను జల్లెడాకుల్లాగా మారుస్తాయి. పెద్ద లార్వాలు ఆకులపై రంధ్రాలు చేస్తాయి. పురుగు ఎక్కువగా ఆశించినచో పైరులో ఆకులన్నీ రంధ్రాలతో ఉండి క్యాబేజి, కాలీఫ్లవర్ పువ్వు పరిమాణం కూడా చాలా చిన్నవిగా ఉంటాయి. దీని నివారణకు ఉద్యానవన పరిశోధన సంస్థ, బెంగుళూర్ వారు సమగ్ర యాజమాన్య పద్ధతులను రూపొందించారు. ప్రతి 25 వరుసల క్యాబేజికి 2 వరుసలు ఆవాలు పంటను విత్తుకోవాలి. క్యాబేజిని ఆశించే పురుగులు ఆవాల మీద ఆకర్షింపబడి అక్కడ గ్రుడ్లను పెడతాయి. ఆవాల పంట నుండి గ్రుడ్లను ఏరి నాశనం చేయాలి. లేదా అజాడిరాక్టిన్ 1500 పి.పి.యం. 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. జీవ సంబంధిత పురుగు మందు అయినటువంటి బి.టి. 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఆర్థిక నష్టపరిమితి స్థాయిని దాటినప్పుడు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**క్యాబేజి కాయ తొలుచు పురుగు:** ఈ పురుగు కాలీఫ్లవర్ మరియు క్యాబేజిను ఎక్కువగా ఆశిస్తుంది. లార్వాలు చిన్న ఆకులను ఈనెల వెంబడి తొలచి తెల్లటి కాగితం వలె చేస్తాయి. పెద్ద లార్వాలు ఆకులను తింటూ చివరిగా క్యాబేజి, కాలీఫ్లవర్‌లను తొలచి రంధ్రాలు చేసి అధికంగా నాశనం చేస్తాయి. నివారణకు సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**కుళ్ళు తెగులు:** ఇది నారుమడిలోను, నాటిన పొలంలోను ఎక్కువగా కన్పిస్తుంది. ముందుగా ఆకుల అంచుల నుండి పసుపు రంగుగా మారుతాయి. తర్వాత ఈనెలు నల్లబడి కాండం కుళ్ళిపోతుంది. తర్వాత పువ్వులను మరియు కాయలను ఆశించడం వలన కాయలు కుళ్ళిపోతాయి. దీని నివారణకు కాయజాతి/పప్పు జాతి పంటలతో పంట మార్పిడి చేయాలి. తెగులు వ్యాప్తిని అరికట్టేందుకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి మొదలు తడిచేలా పిచికారి చేసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8247421216





# అవిసె గింజలు - ఆరోగ్య ప్రయోజనాలు

**డా॥ టి. కమలజ, డా॥ ఆర్. నీలా రాణి, జి. సాయి భావాని మరియు డా॥ శ్వేత కొడాలి**

అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకం - గృహ విజ్ఞాన విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్

అవిసె గింజలను (ఫ్లాక్స్ సీడ్స్), లిన్సీడ్ (లినమ్ ఉసిటాటిస్సిమమ్) అని కూడా పిలుస్తారు. ఇది లినాయేసి మొక్కల కుటుంబానికి చెందినది. అవిసె గింజల్లో రెండు ప్రాథమిక రకాలు ఉన్నాయి. గోధుమ మరియు బంగారు, రెండు రకాలు కూడా మనకు చౌకగా లభిస్తాయి. ముదురు గోధుమ రంగు విత్తనాలు బంగారు విత్తనాల కంటే కొంత బలమైనవి మరియు రుచిని కలిగి ఉంటాయి. రెండూ రకాలలో ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం యొక్క మంచి గుణాలు ఉన్నప్పటికీ, గోధుమ రంగు విత్తనాలలో, బంగారు రకం కంటే ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం కొంచెం ఎక్కువ మోతాదులో ఉంటుంది. దీనిని ఆహార మరియు ఫైబర్ పంటగా సమశీతోష్ణ వాతావరణంలో పండిస్తారు. అవిసె గింజ అనేది వృక్ష సంబంధిత ఆహారం, ఇది ఆరోగ్యకరమైన కొవ్వును, యాంటీఆక్సిడెంట్లు మరియు ఫైబర్లను అందిస్తుంది. శాస్త్రవేత్తలు దీనిని "ఫంక్షనల్ ఫుడ్" అని కూడా పిలుస్తారు. దీనికి గల కారణం మనిషి ఆరోగ్యాన్ని పెంచడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. ప్రస్తుత కాలంలో అవిసె గింజలను వివిధ రూపాలు అనగా విత్తనాలు, నూనెలు, పొడి, మాత్రలు, గుళికలు మరియు పిండి రూపాలలో లభిస్తున్నాయి. ముఖ్యంగా మలబద్ధకం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, క్యాన్సర్ మరియు అనేక ఇతర వ్యాధులను నివారించడానికి ఉపయోగపడుతుంది.

### ఆరోగ్య ప్రయోజనాలు

- అవిసె గింజల్లోని పోషకాలలో లిగ్నిన్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ప్రోటీన్ మరియు ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం లేదా ఒమేగా-3 వంటి బహుళ అసంతృప్త కొవ్వు ఆమ్లాలు ఉన్నాయి. శరీరం నుండి ఫ్రీ రాడికల్స్ అని పిలవబడే అణువులను తొలగించడం ద్వారా వ్యాధులను నివారించడం లో సహాయపడతాయి.
- అవిసె గింజల నూనెలోని ఒమేగా 3 క్రొవ్వు ఆమ్లాలు అనగా ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం మరియు ఇతర సంబంధిత రసాయనాలు రుమటాయిడ్ అర్థ్రైటీస్ మరియు ఇతర తాపజనక వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు.
- అవిసె గింజలు ఇనుము, పొటాషియం, జింక్, సోడియం మరియు కాల్షియం యొక్క మంచి మూలం. అవిసె గింజల్లో కార్బోహైడ్రేట్ కంటెంట్ తక్కువగా ఉంటుంది. ఇవి మధుమేహ రోగులకు మంచి ఆహారం.
- అవిసె గింజల్లో ఫైటోస్టెరాల్స్ కూడా ఉంటాయి. ఫైటోస్టెరాల్స్ కొలెస్ట్రాల్‌కు సమానమైన నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. అయితే అవి ప్రేగులలో కొలెస్ట్రాల్‌ను గ్రహించకుండా నిరోధించడంలో సహాయపడతాయి. అందువల్ల ఫైటోస్టెరాల్స్

తీసుకోవడం వల్ల శరీరంలో "చెడు" కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు.

- ఫ్లాక్స్ సీడ్ ముఖ్యంగా పాలీఫినాల్స్ అని పిలువబడే ఆరోగ్య-రక్షిత యాంటీఆక్సిడెంట్ల యొక్క అగ్ర మూలం. ఈ యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బులు మరియు క్యాన్సర్‌ల నుండి అలాగే సెల్-డ్యామేజింగ్ ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుండి రక్షణ కల్పిస్తాయి. అంటే అవి అకాల వృద్ధాప్యం మరియు న్యూరోడిజనరేటివ్ వ్యాధులను (అల్జీమర్స్ మరియు పార్కిన్సన్ వంటివి) నివారించడానికి సహాయపడతాయి.
- అవిసె గింజలోని మంచి కొవ్వులు రక్తపోటును తగ్గించడానికి, ధమని గట్టిపడకుండా ఉండటానికి, "చెడు" కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, గుండె జబ్బులు మరియు స్ట్రోక్‌లను నివారించడానికి సహాయపడతాయి.
- అవిసె గింజల్లో కరిగే ఫైబర్ మరియు కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడటానికి రెండు రకాల ఫైబర్‌లు కలిసి పనిచేస్తాయి. దీనిలో ఉండే ఫైబర్ మలబద్ధక నివారణలో ఎంతగానో దోహదం చేస్తుంది.
- క్యాన్సర్ కణితుల అభివృద్ధిని నివారించడానికి అవిసె గింజలు ఉపయోగపడతాయి. మరీ ముఖ్యంగా రొమ్ము, ప్రోస్టేట్ మరియు పెద్ద ప్రేగు క్యాన్సర్లు రాకుండా అవిసె గింజల్లో లిగ్నిన్స్ పుష్కలంగా ఉండటం. దీనిలో యాంటీఅన్జియోజెనిక్ లక్షణాలు కూడా ఉన్నాయి. దీని వలన కొత్త రక్త నాళాలలో కణితులను ఏర్పడకుండా మరియు పెరగకుండా ఆపవచ్చు.
- అవిసె గింజలు రక్తంలో గ్లూకోజ్ మరియు ఇన్సులిన్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి మరియు ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తాయి. దీని వలన హెచ్‌బిఏఐసి స్థాయి కూడా మెరుగుపడుతుంది.
- అవిసె గింజల్లో కరిగే ఫైబర్‌ను చాలా వరకు ముసిలేజ్ అంటారు. ఇది ఆకలి పెరగకుండా చేస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది.
- అవిసె గింజల్లో ఉండే అధిక ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు చర్మం దద్దుర్లు, చికాకు తగ్గించడానికి సహాయపడతాయి మరియు గాయాలు వేగంగా నయం కావడానికి సహాయపడతాయి.
- సల్లాడ్లు లేదా వండిన కూరగాయలపై అవిసె గింజలను లేదా పొడిని కలుపుకొని తేలికగా తినవచ్చు. అంతేకాక కేకులు వంటి బేకరీ పదార్థాల్లో కూడా అవిసె గింజలను ఉపయోగించవచ్చు.

**100 గ్రా. అవిసె గింజల్లోని పోషక విలువలు**

| పోషకాలు | పోషక విలువలు |
|---|---|
| శక్తి (కిలో క్యాలరీలు) | 443.83 |
| ప్రోటీన్ (గ్రా.) | 18.55 |
| క్రొవ్వు (గ్రా.) | 35.67 |
| ఫైబర్ (గ్రా.) | 26.17 |
| కార్బోహైడ్రేట్స్ (గ్రా.) | 10.99 |
| విటమిన్ బి 1 (మి. గ్రా.) | 0.28 |
| విటమిన్ బి 2 ( మి. గ్రా.) | 0.05 |
| విటమిన్ బి 3 (మి. గ్రా.) | 1.09 |
| విటమన్ బి 5 (మి. గ్రా.) | 0.37 |
| విటమిన్ బి 6 (మి. గ్రా.) | 0.35 |

| పోషకాలు | పోషక విలువలు |
|---|---|
| విటమిన్ బి 7 ( మి. గ్రా.) | 21.25 |
| విటమిన్ బి 9 ( మైక్రో గ్రా.) | 86.50 |
| కెరోటినాయిడ్స్ (మైక్రో. గ్రా.) | 92 |
| విటమిన్ డి 2 (మైక్రో. గ్రా.) | 0.55 |
| ఇనుము ( మి. గ్రా.) | 5.44 |
| జింక్ (మి. గ్రా.) | 4.86 |
| పొటాషియం (మి. గ్రా.) | 655 |
| సోడియం (మి. గ్రా.) | 32.93 |
| కాల్షియం (మి. గ్రా.) | 257 |
| సంతృప్త కొవ్వు ( గ్రా.) | 2.97 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9985892124**

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు, జె.ఎస్. సుధారాణి మరియు డా॥ పి. ప్రశాంత్
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1. | 01.03.2021 | నేరుగా విత్తిన వరిలో పాటించవలసిన మెళకువలు | డా॥ యం. గోవర్ధన్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్, 9440467091 |
| 2. | 03.03.2021 | పక్షులు మరియు జంతువుల నుండి పంటల రక్షణ - సూచనలు | డా॥ వి. వాసుదేవ రావు, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్యం, రాజేంద్రనగర్, 9440411166 |
| 3. | 05.03.2021 | వివిధ పంటల్లో యాంత్రీకరణ | డా॥ పి. రాజయ్య, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్, వ్యవసాయ పనిముట్లు మరియు యంత్రాల పరిశోధన విభాగం, రాజేంద్రనగర్, 7288028996 |
| 4. | 08.03.2021 | వేసవి అపరాలలో సస్యరక్షణ | డా॥ యన్. సంధ్యా కిషోర్, శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్, 9948976575 |
| 5. | 10.03.2021 | తడి పొడి పద్ధతిలో వరి సాగు విధానం | డా॥ పి. రేవతి, శాస్త్రవేత్త (అగ్రో) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, 9912944880 |
| 6. | 15.03.2021 | యాసంగి పంటల్లో ఎరువుల యాజమాన్యం-భూసార పరీక్ష ప్రాముఖ్యత | డా॥ యమ్. రాజేశ్వర్ నాయక్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం, మంచిర్యాల, 9100229854 |
| 7. | 17.03.2021 | వరిలో మేలైన విత్తనోత్పత్తికి మెళకువలు | పి. గోన్యా నాయక్, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, 9701592326 |
| 8. | 19.03.2021 | వేరుశనగ కోత మరియు నిల్వలో పాటించవలసిన మెళకువలు | డా॥ కె. శ్రీధర్, శాస్త్రవేత్త (అగ్రో) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం, 9948735896 |
| 9. | 22.03.2021 | వేసవి పంటలలో తెగుళ్ళ యాజమాన్యం | డా॥ జె. హెమంత్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం, వైరా, 9440335917 |
| 10. | 24.03.2021 | ప్రస్తుతం ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు | సరిత, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం) జోగిపేట, 8074151952 |
| 11. | 26.03.2021 | యాసంగి పంటల్లో పురుగుల యాజమాన్యం | డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్, 9885257714 |
| 12. | 31.03.2021 | యాసంగి వరిలో చీడపీడల యాజమాన్యం | ఓం ప్రకాశ్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, 9866373563 |

II. టి-శాట్ (రైతు మిత్ర): సాయంత్రం 4.00-5.00

| | | | |
|---|---|---|---|
| 1. | 01.03.2021 | ధాన్యం నిల్వలో మెళకువలు | డా॥ బి. అనీల్ కుమార్, యస్.యమ్. యస్ (క్రాప్ ప్రొటెక్షన్) ఏరువాక కేంద్రం, వరంగల్, 7893888962 |
| 2. | 08.03.2021 | యాసంగి వరి నూక సమస్య - కారణాలు - నివారణ చర్యలు | డా॥ ఆర్. మధుకర్, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, 9908850198 |
| 3. | 15.03.2021 | చిరుధాన్య పంటల సాగు - సూచనలు | డా॥ పి. ఝాన్సీ రాణి, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 9121700997 |
| 4. | 22.03.2021 | ఆహార నాణ్యతా నియంత్రణలో ప్రయోగశాలల పాత్ర | డా॥ లక్ష్మి ప్రసన్న, శాస్త్రవేత్త (క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్) రాజేంద్రనగర్, హైదరాబాద్, 9493451857 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ సిహెచ్. వేణుగోపాల రెడ్డి, డా॥ కె. వాణిశ్రీ మరియు డా॥ యం. విజయలక్ష్మి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. వరిలో ఆకులు సన్నగా పెరిగి తెల్లగా మారి విరిగిపోవటం, ఆకుల అంచుల దగ్గరలో రంధ్రాలు ఏర్పడటం, వెన్నుదశలో కొన్ని గింజలు పాలుపోసుకోక పాక్షికంగా తాలుగా మారితే ఏ పురుగు ఆశించినట్లుగా భావించాలి?**

ఎ. ఉల్లికోడు　　బి. తామర పురుగులు
సి. వరి ఈగ　　డి. సుడిదోమ

**2. మెడో పద్ధతిలో జామ తోటల సాగు ద్వారా రైతులు ఒక ఎకరాకు దాదాపు ఎన్ని మొక్కలు పెంచుకోవచ్చును?**

ఎ. 444　　బి. 2000
సి. 5000　　డి. ఏదీకాదు

**3. పురుగు / తెగుళ్ళ మందులు కొనుగోలు చేసేటప్పుడు మందు ప్యాకింగ్‌పై త్రిభుజాకారంలో నీలం రంగు గుర్తు ఉంటే దేనికి సంకేతం?**

ఎ. అత్యధిక విషపూరితం
బి. ఒక మోస్తరు విషపూరితం
సి. కొద్దిపాటి విషపూరితం
డి. ఏదీ కాదు

**4. మామిడి తోటల్లో కొన్ని సార్లు మొక్కల ఆకుల అంచులు మాడిపోవటం (కొన నుండి క్రిందకు) ఏ పోషక లోపం వలన జరుగుతుంది?**

ఎ. పొటాషియం　　బి. జింకు
సి. ఇనుము　　డి. ఏదీకాదు

**5. వేసవి పంటగా పెసర, మినుమును రైతులు ఎప్పటి వరకు వేసుకోవచ్చు?**

ఎ. మార్చి, 15　　బి. ఏప్రిల్ చివరి వరకు
సి. ఫిబ్రవరి　　డి. ఏదీకాదు

**6. భారత ప్రభుత్వ ఆధీనంలోని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (యన్ యఫ్ డి బి) ఎక్కడ ఉంది?**

ఎ. బెంగుళూరు　　బి. హైదరాబాద్
సి. చెన్నై　　డి. న్యూఢిల్లీ

**7. అమ్మోనియం క్లోరైడ్‌లో నత్రజని శాతం ఎంత ఉంటుంది?**

ఎ. 30%　　బి. 25%
సి. 60%　　డి. 80%

**8. భారత ప్రభుత్వం రైతులకు ఆర్థిక చేయూతనందించే పథకం?**

ఎ. పిఎం యోజన
బి. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి
సి. రైతు భరోసా
డి. ఏదీకాదు

**9. టమాటలో కాయలపైన ఉంగరాల వంటి లేత పసుపు రంగు వలయాలు ఏ తెగులు వలన వస్తాయి?**

ఎ. పల్లాకు తెగులు
బి. ఆకుమచ్చ తెగులు
సి. స్పాటెడ్ విల్ట్ వైరస్ తెగులు
డి. ఏదీకాదు

**10. ఈ మధ్య కాలంలో ప్రాచుర్యం పొందుతున్న ఎలాంటి వాతావరణ పరిస్థితులకైనా తట్టుకొనే నలుపు రంగు మాంసం గల ఔషధ గుణాలున్న కోడి ఏది?**

ఎ. కడక్ నాథ్　　బి. వనరాజా
సి. గిరిరాజా　　డి. రాజశ్రీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50 వ పేజీలో చూడవచ్చు

విశ్వవిద్యాలయ వార్తలు

## సమృద్ధి కృషి శిక్షా సమ్మాన్ అవార్డును సాధించిన విశ్వవిద్యాలయం

వరిలో తడి-పొడి విధానాన్ని రైతుల పొలాల్లో అమలుపరిచి విస్తృత ప్రచారం కల్పించినందుకు మహేంద్రా అండ్ మహేంద్రా సంస్థ "సమృద్ధి కృషి శిక్షా సమ్మాన్" అవార్డుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంపికైనది. ఈ అవార్డును మహేంద్రా సంస్థ ప్రతినిధి కె. వంశీకృష్ణా రెడ్డి ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావుకు ఫిబ్రవరి 11న అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ తడి-పొడి విధానాన్ని కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తల ద్వారా 10 జిల్లాల్లో 370 మంది రైతుల పొలాల్లో అమలుపరిచి ప్రాచుర్యం కల్పించామని మరియు నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం జరిపిన అధ్యయనంలో ఈ విధానం అమలు పరచడం వల్ల 4 శాతం అధిక దిగుబడి సాధించడమే కాకుండా సుమారు 24 శాతం నీటి ఆదా అవుతుందని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డుకు విశ్వవిద్యాలయం ఎంపిక కావడం పట్ల ఉపకులపతి సంతృప్తిని వ్యక్తం చేశారు.

## విశ్వవిద్యాలయంతో సమావేశమైన ప్రాణధార ఫౌండేషన్ ప్రతినిధులు

నేరుగా వరి విత్తే పద్ధతిలో సాగుకు సంబంధించి ప్రాణధార ఫౌండేషన్ ప్రతినిధులు ఫిబ్రవరి 12 న విశ్వవిద్యాలయ ఉపకులపతితో సమావేశమయ్యారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ప్రాణధార ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న ఈ విధానాన్ని మరియు వాటి ఫలితాలను డా॥ వి. ప్రవీణ్ రావుకు వివరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ వరిసాగులో యాంత్రీకరణ అవసరం ఎంతో ఉందని, వరి నాట్ల నుంచి కోత వరకు అనేక పనులలో యాంత్రీకరణ చేపట్టాల్సి ఉందని మరియు తెలంగాణ ప్రాంత భూములు, పరిస్థితుల కనుగుణంగా నేరుగా వరి విత్తే పద్ధతి ఏ మేరకు ఉపయోగబడుతుందన్న అంశాలపై విశ్వవిద్యాలయం మరియు ప్రాణధార ఫౌండేషన్ ప్రతినిధులు చర్చించి ఓ కార్యచరణ రూపొందించాలని సూచించారు.

## ఘనంగా నిర్వహించిన ప్రత్యేక హరితహారం

గౌ॥ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు ఆలోచనలకి అనుగుణంగా బయోడైవర్సిటీ పెంపుదలకి కృషి చేస్తామని ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా బయోడైవర్సిటీ పార్క్‌లో ప్రత్యేక హరితహారాన్ని ఫిబ్రవరి 17 న ఘనంగా నిర్వహించారు. జూన్, జూలై నాటికి అగ్రి బయోడైవర్సిటీ పార్క్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, భవిష్యత్‌లో వ్యవసాయం బయోడైవర్సిటీ ఆధారంగానే ఉండబోతుందని మరియు ఈ వానాకాలం నుంచి వర్సిటీలో చేరిన ప్రతి విద్యార్థి విధిగా ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రవీణ్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్, పాలక మండలి సభ్యులు, ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా మొక్కలు నాటారు.

## బోధన, అభ్యాసం మరియు పరిశోధనల కోసం సమాచార నిర్వహణ నైపుణ్యాల పై మాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సు

బోధన, అభ్యాసం మరియు పరిశోధనల కోసం సమాచార నిర్వహణ నైపుణ్యాలపై రెండో దశ మాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని ఫిబ్రవరి 15న విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు, ఐసిఏఆర్- ఎన్ఏహెచ్ఈపి నేషనల్ డైరెక్టర్, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషల్), న్యూఢిల్లీ డా॥ ఆర్.సి. అగర్వాల్, నేషనల్ కో ఆర్డినేటర్ డా॥ ఆర్. బి. శర్మ ఫిబ్రవరి 15 న ప్రారంభించారు. నాలెడ్జ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా వివిధ విశ్వవిద్యాలయాలు ఒకరికొకరు పరస్పర సహకారంతో పనిచేయాలని, కోవిడ్ తర్వాత నాలెడ్జ్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యత పెరిగిందని మరియు నూతన విద్యా విధానంలో అధ్యాపకులు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ చేపట్టేలా ప్రోత్సహిస్తున్నదని ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు తెలిపారు.

## ఘనంగా నిర్వహించిన ఆరవ జాతీయ యూత్ కన్వెన్షన్

విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి మరియు అఖిల భారత వ్యవసాయ విద్యార్థుల సంఘం సంయుక్తంగా వర్చ్యువల్ పద్ధతిలో రెండు రోజుల పాటు (20,21 ఫిబ్రవరి) 6 వ నేషనల్ యూత్ కన్వెన్షన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటి డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్) డా॥ ఆర్. సి. అగర్వాల్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో భవిష్యత్తు సవాళ్ళను దృష్టిలో ఉంచుకొనే పాఠ్యప్రణాళికలో ఎప్పటికప్పుడు తగిన మార్పులు చేస్తున్నామని, వ్యవసాయ విద్యార్థులను స్వయం ఉపాధితో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వ్యవసాయ విద్యలో చేరుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి సరైన మార్గదర్శకం ఇచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలని, మరియు విద్యార్థులను వ్యాపార రంగం వైపు మళ్ళించేందుకు ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంకుబేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

**వి. సుధాకర్ మరియు మార్ఖ్ బాబు**

# క్యారెట్ రైతు విజయగాథ

డా॥ ఎమ్. వెంకటేశ్వరరెడ్డి, డా॥ సుహాసిని, డా॥ రాజేశ్వరి, డా॥ రవిందర్ నాయక్,
డా॥ అంజయ్య మరియు డా॥ యస్. ఉపేంధర్
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్





ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలంలో గూడూరు గ్రామాన్ని దత్తత గ్రామంగా ఎంపిక చేయటం జరిగినది. ఈ గ్రామానికి శంషాబాద్ దగ్గరగా ఉండటం వలన, దత్తత గ్రామ కమిటీ సభ్యులు కూరగాయల సాగును ప్రోత్సహించినారు. ప్రోత్సాహాంలో భాగంలో వ్యవసాయ కళాశాలకు చెందిన అనుభవం ఉన్న శాస్త్రవేత్తలతో కూరగాయల మీద శిక్షణ కార్యక్రమాలను నిర్వహించినారు.

దీనిలో భాగంలో గూడూరు గ్రామానికి చెందిన అత్తిలి మల్లారెడ్డి అనే రైతు క్యారెట్ సాగును చేపట్టినారు. మల్లారెడ్డి తనకు ఉన్న భూమిలో కంది, మొక్కజొన్న, ప్రత్తి మరియు వరి పంటను సాగు చేయడం జరిగింది. తరువాత దత్తత గ్రామ కమిటీ శాస్త్రవేత్తల సూచనల మేరకు ముందుగా అర ఎకరంలో క్యారెట్ సాగును చేపట్టినారు. క్యారెట్ సాగులో భాగంగా అర ఎకరం పొలాన్ని ట్రాక్టర్‌తో లోతుగా దుక్కి దున్ని చదును చేసుకొన్నారు. దుక్కి చేయించటానికి ఐదు వేల రూపాయల ఖర్చు చేయడం జరిగినది. దత్తత గ్రామ శాస్త్రవేత్తలు, క్షేత్ర ప్రదర్శనలో భాగంగా నాంధారి కంపెనీకి చెందిన సూపర్ కరోడా అనే క్యారెట్ రకంను రైతుకు అందజేయడం జరిగినది. తరువాత 600 గ్రా. క్యారెట్ విత్తనాన్ని మూడు కిలోల ఇసుకలో కలిపి అర ఎకరం పొలంలో చల్లడం జరిగినది. వర్షం పడటం వలన నీరు ఏమి ఇవ్వలేదు. తరువాత కలుపు నివారణకు మెట్రిబుజిన్ 75 డబ్ల్యు.పి. (70% డబ్ల్యు.డబ్ల్యు) అను కలుపు మందును 100 గ్రా. వంద లీటర్ల నీటిలో కలిపి అర ఎకరం పొలంలో పిచికారి చేసినారు. పొలం తయారీలో భాగంగా ఒక బస్తా ఎరువును (28-28-0) 50 కిలోలు పొలంలో వేయడం జరిగినది. ఎరువులకు సుమారుగా రూ. 2275/- రూపాయలు ఖర్చు చేయడం జరిగినది. క్యారెట్ విత్తనం నాటిన 6-7 రోజులలో మంచి మొలక వచ్చినది. తరువాత నీటి వసతి కోసం స్ప్రింక్లర్‌లు అమర్చినారు. దీని కోసం సుమారుగా 5000/- రూపాయలు ఖర్చు చేయడం జరిగినది. అవసరాన్ని బట్టి స్ప్రింక్లర్‌ల ద్వారా నీరు అందించారు. తరువాత నాటిన 45 రోజులకు ఒకసారి 19-19-19 అనే ఎరువుల మందును లీటరు నీటికి 5 గ్రా. కలిపి పిచికారి చేయడం జరిగినది. వాతావరణం అనుకూలంగా ఉండటం వలన ఎటువంటి పురుగు మందులు పిచికారి చేయవలసిన అవసరం రాలేదు. క్యారెట్ విత్తిన 90 రోజులకు, దశల వారిగా క్యారెట్‌ను పీకి, నీటిలో శుభ్రంగా కడిగిన తరువాత మార్కెట్‌కు

తరలించినారు. కోత మరియు రవాణాకు సుమారుగా రూ॥ 20,000/- (ఇరవై వేల రూపాయలు) ఖర్చు అయినది. క్యారెట్‌కు మార్కెట్ రేటు సరాసరి కిలోకు పదిహేను రూపాయలు ధర వచ్చినది. మొత్తంగా అర ఎకరానికి 50 క్వింటాళ్ళ క్యారెట్ దిగుబడి వచ్చినది. చివరకు అర ఎకరం నుండి మొత్తం ఆదాయం రూ. 75,000/- వచ్చినది. సాగు ఖర్చు రూ. 34,575/- అయినది. నిఖరాదాయం రూ॥ 40,425/- వచ్చినది.

| సాగు ఖర్చు వివరాలు (అర ఎకరానికి) | ఖర్చు (రూపాయలలో) |
|---|---|
| 1) దుక్కిదున్నటం మరియు చదును చేయడం | 5,000/- |
| 2) విత్తనం ఖరీదు | 1,500/- |
| 3) కలుపు నియంత్రణ | 800/- |
| 4) ఎరువులు | 2,275/- |
| 5) కోత కూలీ | 10,000/- |
| 6) రవాణా ఖర్చు | 10,000/- |
| 7) స్ప్రింక్లర్ అమరిక | 5,000/- |
| | 34,575/- |

దిగుబడి 50 క్వి.

మొత్తం ఆదాయం (15/- కిలో) రూ॥ 75,000/-

సాగు ఖర్చు = రూ॥ 34,575/-

నిఖరాదాయం = రూ॥ 40,425/- (అర ఎకరానికి)

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9491151524**

## మీకు తెలుసా?

**మనం పీల్చే ఆక్సిజన్‌లో 20 శాతం మెదడే ఉపయోగించుకుంటుంది**



**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. సి, 2. బి, 3. బి, 4. ఎ, 5. ఎ, 6. బి, 7. బి, 8. బి, 9. సి, 10. ఎ**

# తీగ జాతి కూరగాయల సాగుకు ముఖ్య సూచనలు

డా. ఇ. రాంబాబు, డా. ఎస్. మాలతి, ఎ. రాములమ్మ, డా. ఎన్. కిషోర్ కుమార్, బి. క్రాంతి కుమార్ మరియు డి. ఉష శ్రీ

కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల




1. చదునైన దుక్కిపై ఎత్తుమడులు తయారు చేసి, వాటిపై పాలిథీన్ షీటు (25-30 మైక్రాన్‌ల మందం) ను పర్చడం
2. పాలిథీన్ షీటుపై 50-60 సెం.మీ. దూరంలో రంధ్రాలు చేసి, వాటిలో 1-2 విత్తనాల్ని విత్తడం
3. విత్తిన 10-15 రోజుల దశ (2-4 ఆకులు) లో మరియు పూత, పిందె దశలో బోరాన్ పిచికారి చేయడం
4. పసుపు, నీలం రంగు జిగురు అట్టలు, పండు ఈగ బుట్టలు, లింగాకర్షక బుట్టలతో నిఘా/ నియంత్రణ
5. నెల రోజుల వయస్సు గల తీగలను పురికొసల సహాయంతో పందిరి మీదికి పాకించడం
6. సస్యరక్షణలో భాగంగా వృక్ష సంబంధ మందుల(వేప నూనె) వాడకం
7. కాయలు/పండ్ల కోతకు సూచికలు:
   - పుచ్చ కాయల క్రింది భాగం పసుపు రంగులోకి మారడం
   - ఖర్బూజ పండ్లలో మార్కెట్ దూరాన్ని బట్టి సగం/పూర్తి వల నిర్మాణం
   - సొరకాయలపైన తెల్లటి నూగులు కన్పించటం
   - గుమ్మడి కాయలపైన బూడిద లాంటి పదార్థం కప్పబడటం

RNI No : TELTEL/2015/60296
Total No. of Pages : 52
March, 2021
Postal Regd.No:HSE/1013/2021-2023
Date of Publication : 06.03.2021
Date of Posting : 09.03.2021




# వర్సిటీ బ్రాండ్ "పీ నట్ గోల్డ్" - వేరుశనగ నూనెలకే తలమానికం

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. Ch. Venu Gopala Reddy on behalf of Professor Jayashankar Telangana State Agricultural University,
Owned by Professor Jayashankar Telangana State Agricultural University,
Printed At : PJTSAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Published From : Professor Jayashankar Telangana State Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Editor : Dr. Ch. Venu Gopala Reddy, RNI File No. 1262077, Title-Code : TELTEL00152